# విశాలాంధ్ర

కృష్ణా, ఎన్టీఆర్ గుంటూరు, పల్నాడు

బుధవారం 03 డిసెంబరు 2025 8 పేజీలు


## నేడు 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి

**అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర గౌరవాధ్యక్షులు ఆకిటి అరుణ్‌కుమార్**

**విశాలాంధ్ర-గుంటూరు వైద్యం :** ఈ నెల 3న విజయవాడ జరిగే 'చలో విజయవాడ' కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ నగర గౌరవాధ్యక్షులు, సీపీఐ నగర కార్యదర్శి ఆకిటి అరుణ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు మంగళవారం కొత్తపేటలోని మల్లయ్యలింగం భవన్‌లో మీడియా సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆకిటి అరుణ్‌కుమార్ మాట్లాడుతూ గత 11 సంవత్సరాల నుంచి అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో..సీపీఐ సారధ్యంలో అనేక శాంతియుత పోరాటాలు జరపడం వలన మరణించిన 142 మంది బాధిత కుటుంబాలకు రూ.5లక్షల చొప్పున గత టీడీపీ ప్రభుత్వంలో

-మిగతా 2 లో ...

## పార్టీ సీనియర్ నాయకుడు పోట్రు అస్తమయం

**-అసాంఘిక శక్తులపై అలుపెరగని పోరాటయోధుడు..**

**-శ్రద్ధాంజలి ఘటించిన పార్టీ నాయకులు జల్లి విల్సన్, దోనేపూడి శంకర్, జి కోటేశ్వరరావు**

**విశాలాంధ్ర-విజయవాడ:** నగరంలో ప్రజలను భయభ్రాంతులకు గురిచేస్తున్న అసాంఘిక శక్తులపై అలుపెరగని పోరాటం చేసిన సీపీఐ నగర సమితి సీనియర్ నాయకులు పోట్రు వెంకటేశ్వరరావు(93) అస్తమించారు. వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ మంగళవారం సాయంత్రం నగరంలోని ఊర్వశి థియేటర్ సమీపంలోని తన నివాసంలో తుదిశ్వాస విడిచారు. ఆయనకు ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. భార్య సుబ్బులమ్మ 39వ డివిజన్ కార్పొరేటర్‌గా పనిచేసి 2009లో మరణించారు. పోట్రు మరణవార్త తెలుసుకున్న సీపీఐ రాష్ట్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్, మాజీ ఎమ్మెల్సీ జల్లి విల్సన్, ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్, నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు, సహాయ కార్యదర్శి నక్కా వీరభద్రరరావు, స్థానిక ఎమ్మెల్యే బొండా ఉమామహేశ్వరరావు ఆయన మృతదేహానికి పార్టీ జెండా కప్పి, పూలమాల వేసి శ్రద్ధంజలి ఘటించారు. ఈ సందర్భంగా పార్టీకి సుదర్ఘీకాలంపాటు ఆయన అందించిన విశేషమైన సేవలను సర్మించుకుని మాట్లాడుతూ ప్రజా ఉద్యమాల్లో చురుకుగా పాల్గొని పార్టీ బలోపేతానికి కృషి చేశారని అన్నారు. పార్టీ నాయకులు తమ్మిన పోతురాజు, ఉప్పలపాటి రాచంద్రరాజులకు సహచరుడుగా ఉంటూ నగరంలో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే అసాంఘిక శక్తులను అరికట్టేందుకు కమ్యూనిస్టు సైనికుడిగా ప్రముఖ పాత్ర పోషించారని తెలిపారు. పార్టీ బలోపేతానికి ఎందరో

-మిగతా 2 లో ...

## గంజాయిపై ఉక్కుపాదం

- 75 రోజుల్లో 28 కేసులు నమోదు
- 127 మంది అరెస్ట్
- మాదకద్రవ్యాల నష్టాలపై విద్యాసంస్థల్లో అవగాహన కార్యక్రమాలు
- గంజాయి రహిత జిల్లానే లక్ష్యం: ఎస్పీ వకుల్

**విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ :** గుంటూరు జిల్లాలో గంజాయి కార్యకలాపాలపై జిల్లా ఎస్పీ వకుల్ జిందల్ ఉక్కుపాదం మోపుతున్నారు. జిల్లా ఎస్పీగా బాధ్యతలు చేపట్టిన నాటి నుంచి గుంటూరు జిల్లాను గంజాయి రహిత జిల్లాగా తీర్చిదిద్దటానికి విశేష కృషి చేస్తున్నారు. 75 రోజుల్లోనే గంజాయి కార్యకలాపాల్లో పాల్గొంటున్న 163 మంది వ్యక్తులను గుర్తించి వారిపై 28 కేసులు నమోదు చేయించారు. వారిలో 127 మందిని అరెస్ట్ చేయించడం జరిగింది. (మిగిలిన 36 మందిని

-మిగతా 2 లో ...

## రేపు సీపీఐ పల్నాడు జిల్లా జనరల్ బాడీ సమావేశం

**విశాలాంధ్ర-వినుకొండ :** భారత కమ్యూనిస్టు పార్టీ సి పి ఐ పల్నాడు జిల్లా జనరల్ బాడీ సమావేశం ఈనెల డిసెంబర్ 4వ తేదీన ఉదయం 10 గంటలకు గురజాల నియోజకవర్గం దాచేపల్లి లోని నారాయణపురం సిపిఐ ఫంక్షన్ హాలులో జరుగుతుందని సిపిఐ పల్నాడు జిల్లా కార్యదర్శి మారుతీ వరప్రసాద్ తెలిపారు. సమావేశానికి సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యురాలు అక్కినేని వనజ హాజరవుతారని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో ప్రధానంగా జనవరి 18వ తేదీన తెలంగాణ రాష్ట్రం ఖమ్మం పట్టణము నందు జరుగనున్న సిపిఐ 100 సంవత్సరాల వార్షికోత్సవాల ర్యాలీ బహిరంగ సభ జరుగుతుందని ఈ బహిరంగ సభలో జాతీయ ప్రధాన కార్యదర్శి కామ్రేడ్ డి. రాజా, పార్టీ కంట్రోల్ కమిషన్ చైర్మన్ కే నారాయణ, జాతీయ కార్యదర్శి కామ్రేడ్ కే రామకృష్ణ, తెలంగాణ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, ఏపీ సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య ఇరు రాష్ట్రాల నాయకులు పాల్గొని ప్రసంగిస్తారని, పార్టీ శాఖల సమావేశాలు పార్టీ సభ్యత్వం నిధి వసూలు తదితరాలు చర్చించబడతాయి. కావున పార్టీ సభ్యులందరూ సకాలంలో హాజరు కావాల్సిందిగా కోరుతున్నాము. ఆయా నియోజకవర్గాల కార్యదర్శులు బాధ్యతగా నాయకులు ప్రజా సంఘాల బాధ్యులు సభ్యులందరూ హాజరయ్యే విధంగా తగు కార్యచరణ తీసుకోవాల్సిందిగా కోరుతున్నామని తెలిపారు.

## మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

7

## ప్రజల సమస్యలు పరిష్కరించాలి

**పిజిఆర్ఎస్‌కు భారీగా హాజరైన ప్రజలు**

**ప్రజల వద్దనుండి 600 అర్జీలు సమర్పణ**

**రెవెన్యూ సంభందిత సమస్యలపై ప్రత్యేక శ్రద్ధ**

**పిజిఆర్ఎస్‌లో వసంత, కలెక్టర్ లక్ష్మిశ, ఇల్కియా**

**విశాలాంధ్ర,మైలవరం :** ప్రజా సమస్యలు పరిష్కరించాలని ఎమ్మెల్యే వసంత అధికారులను ఆదేశించారు. మైలవరంలో మంగళవారం నిర్వహించిన పిజిఆర్ఎస్‌కు స్పందన లభించింది. మైలవరం పట్టణంలోని ఎస్వీ కళ్యాణ మండపంలో మంగళవారం మధ్యాహ్నం ప్రజాదర్బారు కార్యక్రమం అని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మైలవరం ఎమ్మెల్యే వసంత తో పాటు, జిల్లా కలెక్టర్ లక్ష్మీశ,జిల్లా జాయింట్ కలెక్టర్ ఇలక్కియా, ఎన్టీఆర్ జిల్లాలోని వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు. ఎప్పటినుంచో పెండింగులో ఉన్న రెవిన్యూ సంబంధిత ప్రజా సమస్యలతో పాటు ఇతరత్రా సమస్యల సత్వర పరిష్కారమే ప్రధాన లక్ష్యంగా ప్రజాదర్బారు నిర్వహణను ఎమ్మెల్యే వసంత ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నారు. మైలవరం

-మిగతా 2 లో ...

(మొదటి పేజీ తరువాయి)

# నేడు 'చలో విజయవాడ'ను జయప్రదం చేయాలి

చంద్రబాబు నాయుడు ఎక్స్‌గ్రేషియా ఇచ్చినట్లు పేర్కొన్నారు. రూ.250 కోట్లు కార్పస్ ఫండు ఇచ్చారని, రూ.10వేలు, రూ.20వేలు లోపు వారికి వైఎస్ జగన్మోహన్ రెడ్డి బటన్ నొక్కి రూ.906 కోట్లు బాధితులకు ఇచ్చారని, చివరి భాధితునికి చివరి పైసా వచ్చే వరకు సీపీఐ పార్టీ బాధితులకు అండగా ఉంటుందన్నారు. ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా అగ్రిగోల్డ్ బాధితులకు అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి వెంటనే న్యాయం చేసి, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోవాలని, లేనిచో ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి బాధితులకు సత్వర న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. అగ్రి గోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్‌ట్రాక్ కోర్టును విజయవాడ కేంద్రంగా ఏర్పాటు చేయాలని, సమర్థత, నమ్మకం కలిగిన ఉత్తమ అధికారుల బృందంతో ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేయాలని కోరారు. కాల పరిమితి విధించాలని, సమస్య పరిష్కారం అయ్యేవరకు ట్రాన్స్‌ఫర్స్ లేకుండా తగినంత మంది అధికారులను సిఐడికి కేటాయించాలని కోరారు. కంపెనీ ఆస్తుల మ్యుటేషన్కు తగినంత వేగంగా పూర్తి చేసి, ఆస్తులు అమ్మకాన్ని వేగవంతం చేయాలని, కోర్టు పర్యవేక్షణలో ప్రముఖ కంపెనీల ద్వారా ఆక్షన్ నిర్వహించాలని, 2015 ముందు రిజిస్టర్ చేయించుకున్న ఇళ్ల స్థలాలను, అపార్ట్‌మెంట్ ఫ్లాట్లను అటాచ్‌మెంట్ల నుండి తొలగించి ఆయా యజమానులకు అందించాలని డిమాండ్ చేశారు. కంపెనీ యాజమాన్యకు కుటుంబాల సభ్యుల పేర్లతో దాచిన బినామీ ఆస్తులన్నిటిని స్వాధీనం చేసుకుని వెంటనే అబ్సల్యూట్ చేయించాలని, ఈ కాలంలో మరణించిన అర్హత కలిగిన బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా ఇప్పించాలని, మరొక బాధితుని మరణం జరగకుండా చూడాలని కూటమి ప్రభుత్వాన్నికి విజ్ఞప్తి చేశారు. సమావేశంలో అగ్రిగోల్డ్ యూనియన్ నాయకులు ప్రసాద్ బాబు, కాజా, నగర కమిటీ సభ్యులు చల్ల మరిదాసు, జంగాల చైతన్య, నూతలపాటి చిన్న, బాధితులు పాల్గొన్నారు.

# గంజాయిపై ఉక్కుపాదం

కూడా అరెస్ట్ చేయడం జరుగుతుందని తెలిపారు.) నమోదైన 28 కేసుల్లో సుమారు 48 కేజీల ఘన రూప గంజాయిని, 139 గ్రాముల లిక్విడ్ గంజాయిని, 28 గ్రాముల ఎండీఎంఏ అనే మత్తు పదార్థాన్ని సీజ్ చేయించడం జరిగింది. వీటితో పాటు 3 ద్విచక్ర వాహనాలను కూడా సీజ్ చేయించారు. గంజాయి కార్యకలాపాలు నిర్వహిస్తున్న వారిని గుర్తించి, వారిపై చట్ట ప్రకారం కఠిన చర్యలు తీసుకోవడానికి 'టాస్క్ ఫోర్స్' బృందాన్ని ఏర్పాటు చేసి, జిల్లా వ్యాప్తంగా గంజాయి కార్యకలాపాలు జరిగే ప్రాంతాలు, గంజాయి కేసుల్లో ఉన్న పాత నేరస్తుల కదలికలపై పటిష్ట నిఘా పెట్టి, విస్తృత తనిఖీలు చేయిస్తూ ఎక్కడికక్కడ గంజాయి కార్యకలాపాలను అరికడుతూ వస్తున్నారు. అదేవిధంగా 'సంకల్పం-మాదక ద్రవ్యాలకు వ్యతిరేకంగా పోరాటం' అనే కార్యక్రమాన్ని ఏపీ విట్ యూనివర్సిటీలో ప్రారంభించారు. 'అవగాహనతో అంతు చూద్దాం' అనే ఆలోచనతో ఈ సంకల్పం కార్యక్రమం ద్వారా విద్యాసంస్థలలో గంజాయి, ఇతర మాదకద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాల గురించి విద్యార్థులకు అవగాహన కల్పించేందుకు కృషి చేస్తున్నారు. గంజాయి కార్యకలాపాల తావు లేకుండా చేసేందుకు ప్రతి పోలీస్ స్టేషన్ పరిధిలో డ్రోన్ గస్తీ నిర్వహించే విధంగా పోలీస్ స్టేషన్ల అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. అన్ని పోలీస్ స్టేషన్ల పరిధిలోని గ్రామాలు, పట్టణాలు, నగరాల శివారు ప్రాంతాల్లో, పాడుబడిన భవనాలు, గుబురు పొదలు, రాత్రి సమయాల్లో జనారణ్యం లేని ప్రాంతాలలో ముమ్మర గస్తీ ఏర్పాటు చేసి, పటిష్ట నిఘా పెట్టి ఎటువంటి అసాంఘిక, చట్ట వ్యతిరేక కార్యకలాపాలు జరగకుండా చూడాలని సూచిస్తున్నారు. ఎవరైనా గంజాయి కార్యకలాపాలకు పాల్పడుతున్నారనే సమాచారం తెలిస్తే వెంటనే స్థానిక పోలీసులకు గానీ, డయల్ 112 నెంబర్‌కి గాని, 1972 అనే టోల్ ఫ్రీ నెంబర్‌కి గాని సమాచారం అందించాలని, సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచబడతాయని ఎస్పీ తెలియజేశారు.

## వధూవరులను ఆశీర్వదించిన సీఎం చంద్రబాబు

**విశాలాంధ్ర-విజయవాడ:** రెండురోజుల క్రితం వివాహం జరిగిన ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య కుమారుడు గౌతమ్ పావెల్, నస్రీరున్నీసా నూతన వధూవరులను ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆశీర్వదించి శుభాకాంక్షలు తెలియజేశారు. మంగళవారం ఆయన స్వయంగా వధూవరులు ఇద్దరినీ సచివాలయంలో అక్షింతలతో శుభాశీస్సులు తెలిపారు. పని వత్తిడిలో వివాహానికి రాలేక పోయానన్న అభిప్రాయాన్ని చంద్రబాబు వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో బోర్డు చైర్మన్ బాలకోటయ్య, నీరజ దంపతుల తోపాటు సలార్ షరీఫ్, షేక్ ఫిరోజ్ ఉన్నారు.

# పార్టీ సీనియర్ నాయకుడు పోట్రు అస్తమయం

యువజన విద్యార్థులను తీర్చిదిద్దడంలో ప్రత్యేకంగా వ్యవహరించేవారని పేర్కొన్నారు. గాంధీ కోఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్‌గా 3 పర్యాయములు సేవలందించి పేద, మధ్యతరగతి ప్రజలకు ఆర్థిక భరోసా కల్పించారని అన్నారు. మరో వైపు నగరంలో పేరెన్నిక గల ఎన్వీ సౌండ్ సిస్టంను స్థాపించి నగరంలో భారీ బహిరంగ సభలకు, వివిధ కార్యక్రమాలకు సౌండ్ సిస్టం అందించడంలో ప్రసిద్ధి చెందారని తెలిపారు. తన బాటలోనే కుటుంబ సభ్యులను పార్టీ వైపు నడిపించడంలో కీలకంగా వ్యవహరించి పార్టీ నిర్భంద సమయంలో కూడా అండదండలు అంచారని అన్నారు. తన రెండవ కుమార్తె భర్త నక్కా వీరభద్రరావు పార్టీ నగర సహాయకార్యదర్శిగాను పెద్ద కుమార్తె ఓర్సు భారతి మహిళా సమాఖ్య నగర అధ్యక్షులుగా ఉంటూ అంకిత భావంతో పార్టీకి సేవలందిస్తున్నారని తెలిపారు. రెండవ కుమార్తె నక్కా రాజ్యలక్ష్మీ 36వ డివిజన్ మహిళా సమాఖ్య కార్యదర్శి ఉంటూ డివిజన్ స్థాయిలో మహిళల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నారని తెలియజేశారు. ఈ సందర్భంగా మహిళా సమాఖ్య రాష్ట్ర కార్యదర్శి పి దుర్గాభవానీ, పార్టీ నగర నాయకులు మూలి సాంబశివ రావు, తూనం వీరయ్య, ఎస్‌కె నజీర్, వి శివన్నారాయణ, ప్రజా నాట్యమండలి నాయకులు ఆర్ పిచ్చియ్య, వివిధ పార్టీ నాయకులు పి వీరయ్య, కాలే పుల్లారావు, అన్నారావు, జి శ్రీనివాసరావు తదితర నాయకులు పాల్గొని శ్రద్ధాంజలి ఘటించారు.

**కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయుడు పోట్రు : దోనేపూడి శంకర్**

నగర కమ్యూనిస్టు ఉద్యమ చరిత్రలో చిరస్మరణీయుడు పోట్రు వెంకటేశ్వరరావు అని అటువంటి కమ్యూనిస్టు యోధుని కోల్పోవడం నగర కమ్యూనిస్టు పార్టీకి తీరని లోటు అని సీపీఐ ఎన్టీఆర్ జిల్లా కార్యదర్శి దోనేపూడి శంకర్ తెలిపారు. మరణవార్త తెలిసిన వెంటనే వారి స్వగృహానికి చేరుకొని మృతదేహానికి నివాళులు అర్పించారు.. ఈ సందర్భముగా ఆయన మాట్లాడుతూ అస్వస్థతగా ఉన్న విషయం తెలుసుకొని మంగళవారం మధ్యాహ్నం పార్టీ జాతీయ కార్యదర్శి కె.రామకృష్ణతో కలసి పోట్రు స్వగృహానికి వెళ్లి వారిని పరామర్శించడం జరిగిందని. కానీ ఇంతలోనే ఆయన మరణించారన్న వార్త తీవ్రదిగ్భ్రాంతికి గురి చేసిందని ఆవేదన వ్యక్తం చేశారు. చలసాని వెంకటరత్నం సాహచరుడుగా కమ్యూనిస్టు ఉద్యమంలో ఎంతో కీలకంగా వ్యవహరించి అప్పటి విజయవాడ తూర్పు నియోజకవర్గంలో కమ్యూనిస్టు పార్టీ పటిష్ఠతకు ఎనలేని కృషి చేసారని తెలిపారు. ఆనాటి సంఘవిద్రోహ శక్తులకు సింహస్వప్నంలాగా ఉండి ప్రజలకు రక్షణగా నిలిచినా యోధుడు అని, పోట్రు సతీమణి సుబ్బుల మ్మ కార్పొరేటర్ గా ఉన్న సమయంలో నిరంతరం డివిజన్ ప్రజల సమస్యలు పరిష్కారానికి, డివిజన్ లో మౌలిక వసతుల కల్పనకు, అభివృద్దిలో తద్దైనా ముద్ర వేశారని అన్నారు. తాను నమ్మిన కమ్యూనిస్టు సిద్ధాంతాలకు తాను కట్టుబడి ఉండటమే కాకుండా తన కుటుంబాన్ని కమ్యూనిస్టు సిద్ధాంతాలవైపు నడిపించడంలో ఆయన పాత్ర ఎంతో కీలకం అని దోనేపూడి శంకర్ తెలిపారు.

**పోట్రు పోరాట పటిమగల నాయకుడు : జి కోటేశ్వరరావు**

పార్టీ సీనియర్ నాయకుడు పోట్రు వెంకటేశ్వరరావు పార్టీలో క్రియాశీలకంగా పనిచేస్తూ అనేక ఉద్యమాల్లో పాల్గొన్నారని నగర కార్యదర్శి జి కోటేశ్వరరావు తెలిపారు. పోట్రు భౌతికదేహానికి శ్రద్ధాంజలి ఘటిస్తూ ఆయన సేవలను స్మరించుకున్నారు. పార్టీ సిద్ధాంతాలకు కట్టుబడి ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేయడానికి పరితపించేవారని అన్నారు. పార్టీ అండదండలతో తనదైన శైలిలో యువతను పార్టీ వైపు నడిపించి నగరంలో అలజడులకు కారణమవుతున్న వారిపట్ల కఠినంగా అణిచివేసేందుకు కృషి చేశారని తెలిపారు. తనతో పాటు తన కుటుంబం కూడా పార్టీ సిద్ధాంతాలతో ముందుకు వెళ్లాలని పార్టీ వైపు నడిపించారని తెలిపారు. పార్టీకి సేవలందించిన పోట్రు లేనిలోటు తీరనిదని తెలిపారు. 3వ తేదీన ఉదయం 10గంటలకు ఊర్వశి థియేటర్ సమీపంలో ఉన్న తన నివాసం నుండి అంతిమయాత్ర ప్రారంభమవుతుందని పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొనాలని పిలుపునిచ్చారు.

**పోట్రు మృతితో ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ తీవ్ర సంతాపం**

కమ్యూనిస్టు పార్టీ సీనియర్ నాయకుడు పోట్రు వెంకటేశ్వరరావు మృతితో ఫార్వర్డ్ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీవీ సుందర రామరాజు తీవ్ర సంతాపం మంగళవారం ఓ ప్రకటనలో తీవ్ర సంతాపం తెలిపారు. 1984 నుండి పోట్రుతోను, వారి కుటుంబ సభ్యులతో సన్నిహిత సంబంధాలు కొనసాగుతూనే ఉన్నాయని అన్నారు. ఆయన ప్రజాప్రతినిధిగా భార్యతో సహా విజయవాడ నగరాభివృద్ధికి విశేషమైన కృషి చేశారు, ఆయన జీవితాంతం భారత కమ్యూనిస్టు పార్టీ కార్యకర్తగా క్రియాశీలకంగా పని చేశారని అన్నారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులకు సానుభూతిని తెలియజేశారు.

# ప్రజల సమస్యలు పరిష్కరించాలి

నియోజకవర్గంలో గతంలో వివిధ చోట్ల మండల కేంద్రాల్లో ప్రజాదర్బారు నిర్వహించారు. ఆయా సందర్భాలలో రెవెన్యూ సమస్యలు, సర్వేకు సంభందించిన భూ సమస్యలు తెలిపారు. వీటికి సంబంధించి సత్వరమే శాశ్వత పరిష్కారం కోసం మైలవరంలో మంగళవారం ప్రజాదర్బారు నిర్వహించారు.

**మండలాల్లో అధికారులు బాధ్యతగా పని చేయాలి.**

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లా అధికారులు అందరూ నియోజకవర్గాని విచ్చేసి గ్రీవెన్స్ నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. మండలంలోని అధికారులు కూడా సమస్యలపై సమగ్ర విచారణ జరిపి బాధ్యతతో వ్యవహరించాలన్నారు. సమస్యలను పరిష్కారం చేయాలని కాకుంటే ఎందుకు పరిష్కరించలేక పోతున్నామో అర్జీ దారునికి వివరించాలన్నారు. ఏమైనా కోర్టు కేసులు వున్నాయా? వివాదాలు వున్నాయా? మరేమైనా కారణాలు ఉంటే వారికి తెలపాలని అన్నారు. అర్జీ దారుల సమయాన్ని వృధా చేయకూడదన్నారు. పి.జి.ఆర్.ఎస్ వస్తున్న ఫిర్యాదులపై ఖచ్చితంగా పనిచేస్తే ప్రజల్లో ప్రభుత్వంపై, పని చేసే అధికారులపై, ముఖ్యంగా గవర్నెన్స్ పై నమ్మకం కలుగుతుందన్నారు.

**నిర్ణీత కాలవ్యవధిలో సమస్యల పరిష్కారం.**

ఈ సందర్భంగా ఎమ్మెల్యే వసంత మాట్లాడుతూ కూటమి ప్రభుత్వ ప్రజాస్వామ్య పాలనకు ప్రజాదర్బారు దర్పణం పడుతుందన్నారు. జవాబుదారీతనంతో ప్రజల సమస్యలను పరిష్కరిస్తున్నట్లు వెల్లడించారు. ఇక్కడ అర్జీలు సమర్పించే ప్రతి సమస్య పబ్లిక్ గ్రీవెన్స్ రెడ్రెస్సెల్ సిస్టం (పి.జి.ఆర్.ఎస్)లో నమోదు చేసి ఆయా శాఖలకు పంపుతామని పేర్కొన్నారు. నిర్ణీత కాలవ్యవధిలో ఆయా సమస్యలు పరిష్కరించనున్నట్లు వెల్లడించారు.

**ప్రతివారం ప్రజాదర్బారు**

జిల్లా అధికారులు కూడా అందుబాటులో ఉండటంతో వారి పరిధిలోని దీర్ఘకాలిక సమస్యలు కూడా వెంటనే పరిష్కరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఇప్పటికే రెడ్డిగూడెం, జి.కొండూరు, మైలవరంలో ప్రజాదర్బారు నిర్వహించామని, ఇకపై క్రమం తప్పకుండా ప్రతివారం ఒక రోజు ప్రజాదర్బారు నిర్వహించనున్నట్లు వెల్లడించారు. ప్రభుత్వ అధికార యంత్రాంగం కూడా ప్రతి అర్జీదారునితో బాధ్యతాయుతంగా వ్యవహరించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న జిల్లా కలెక్టర్ కి, జెసి కి, జిల్లా అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

**600 అర్జీలు సమర్పణ**

మైలవరం నియోజకవర్గ వ్యాప్తంగా అన్ని మండలాల నుంచి 600 మంది అర్జీలు సమర్పించారు. ఇందులో ప్రధానంగా రెవెన్యూకు సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలు, ఇళ్లస్థలాలు, దివ్యంగుల ధ్రువీకరణ పత్రాలు, కొండపల్లి మున్సిపాలిటీలో ప్రధాన రహదారి విస్తరణ, సంక్షేమ పథకాల వర్తింపు తదితర సమస్యలపై అర్జీలను సమర్పించారు. ఈ కార్యక్రమంలో మైలవరం నియోజకవర్గ జనసేన పార్టీ ఇంఛార్జి అక్కల రామ్మోహనరావు (గాంధీ), తదితరులు పాల్గొన్నారు.

# దత్తత గ్రామంలో స్పెషల్ క్యాంపు

## స్వచ్ఛభారత్- ఓటు నమోదు కార్యక్రమాలు...

**విశాలాంధ్ర, మైలవరం :** లకిరెడ్డి బాలిరెడ్డి ఇంజనీరింగ్ కళాశాల యన్.యస్.యస్. యూనిట్ ఆధ్వర్యంలో దత్తత గ్రామమైన మొరుసుమల్లి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో వారం రోజుల స్పెషల్ క్యాంపు ను ప్రారంభించారు. మంగళవారం కార్యక్రమంలో భాగంగా మొరుసుమల్లి మండల పరిషత్ ప్రాథమికోన్నత పాఠశాలలో గ్రామంలో "స్వచ్ఛ భారత్ –"ఓటు నమోదు రిజిస్ట్రేషన్" కార్యక్రమాన్ని గ్రామ ప్రజలకు ఇంటింటికి తిరిగి నిర్వహించారు. మొరుసుమల్లి ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయుడు వరప్రసాద్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరు పరిసరాలు శుభ్రంగా ఉంచుకోవాలని, ప్రతి ఒక్కరు చీపురు చేతబట్టి చెత్తా చెదారాన్ని ఊడ్చివేయడం ద్వారా ప్రజల్లో ప్రతి ఒక్కరూ చెత్తను వీధుల్లో వేయకుండా జాగ్రత్త పడడమే కాకుండా ఇతరులు కూడా చెత్త వేయకుండా చూడాలని కోరారు.అలాగే ప్రతి ఒక్కరు క్లీన్ ఇండియా కోసం కృషి చేస్తూ ఆరోగ్య ఆంధ్రప్రదేశ్ కోసం ప్రతి ఒక్కరు కృషి చేయాలి అని అలాగే వ్యక్తిగత పరిశుభ్రత కు ప్రాధాన్యత ఇవ్వాలని కోరారు.కళాశాల యన్.యస్.యస్. ప్రోగ్రామ్ ఆఫీసర్ డా.బి.శివ హరి ప్రసాద్ మాట్లాడుతూ ఓటు హక్కు ప్రతి ఒక్కరి జన్మ హక్కు అని ఓటు హక్కు ద్వారా నిష్పక్షపాతమైన పాలన సాధ్యమవుతుందన్నారు.నవ సమాజ నిర్మాణానికి ఓటు ఆయుధమని తద్వారా ప్రజాస్వామ్యంలో విలువలు పెంపొందించాలన్నారు.ప్రతి ఒక్కరూ స్వచ్ఛందంగా ఓటు హక్కు పొందే విధంగా ఓటుహక్కు విశిష్టతను తెలియజేయాలన్నారు.ఈ కార్యక్రమంలో కళాశాల యన్.యస్.యస్. ఇన్ ఛార్జ్ ఎస్.ఉమామహేశ్వర రెడ్డి, చల్లా సుబ్బారావు,వివిధ విభాగాల యన్.యస్.యస్. ఇన్ ఛార్జ్ లు,యన్.యస్.యస్. వాలంటీర్లు పాల్గొన్నారు..

## అదుపు తప్పిన ఆటో...డ్రైవర్ మృతి

**విశాలాంధ్ర-పమిడిముక్కల:** మంటాడ నుండి వీరంకిలాకు వెళుతున్న ఆటో రెడ్డిపాలెం వద్ద అదుపుతప్పి చెరువులో బోల్తా పడగా డ్రైవర్ దేశు నాగరాజు (50) మృతిచెందగా ఆటో లో ప్రయాణికులకు గాయాలయ్యాయి. ఈ సందర్భంగా మంటాడనుండి ముగ్గురు మహిళా ప్రయాణికులతో వీరంకిలాకు వెళ్లే ఆటో రెడ్డిపాలెం లోని రామాలయం సమీపాన చెరువు దగ్గరకు రాగానే డ్రైవర్ నాగరాజుకి అనారోగ్య పరిస్థితి తలెత్తడంతో ఆటో అదుపు తప్పి చెరువులో బోల్తా కొట్టగా డ్రైవర్ నాగరాజు అక్కడకక్కడే మృతిచెందగా ప్రయాణకులకు గాయాలవటంతో స్థానికులు రక్షించగా వారిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ వైద్యాలకు తరలించినట్లు ఎస్సై బి శ్రీను తెలిపారు.కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు .మృతునికి భార్య ఇద్దరు మగ పిల్లలు ని తెలిపారు.

## నిఘా నీడలో నందిగామ... సీఐ

**విశాలాంధ్ర-నందిగామ:** నిఘా నీడలో నందిగామ పట్టణాన్ని పోలీసులు పర్యవేక్షిస్తున్నారని స్టేషన్ హౌస్ ఆఫీసర్ వైవిఎల్ నాయుడు అన్నారు విజయవాడ పోలీస్ కమిషనర్ ఆదేశాల మేరకు స్థానిక ఏసీబీ పర్యవేక్షణలో పట్టణాన్ని నిఘా నీడలో ఉండేందుకు సీసీ కెమెరాలు పలు ప్రాంతాలలో అమర్చడం జరిగిందని సిఐ వైవిఎల్ నాయుడు అన్నారు పట్టణంలోనే ప్రధాన సెంటర్ లతోపాటు పట్టణంలోకి ప్రవేశించే పలు ప్రాంతాలలో అత్యంత ప్రతిష్టాత్మక స్థాయిలో సీసీ కెమెరాలను అమర్చడం జరిగినట్లు తెలిపారు నందిగామ పట్టణంలో అలాగే మండల పరిధిలోని అన్ని గ్రామాలలో కూడా సీసీ కెమెరాలు ఏర్పాటుతో ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పక్కకుబందీగా పోలీసులు నిఘా ద్వారా ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు ఏదైనా అనుకోని పరిస్థితుల్లో ఎటువంటి సంఘటనలు జరిగిన సీసీ కెమెరాలు ద్వారా తప్పు చేసిన ఎంతటి వారినైనా అవలీలగా అదుపులోకి తీసుకోవడానికి ఈ సీసీ కెమెరాలు ఎంతగానో ఉపయోగపడతాయని అన్నారు వాటి పర్యవేక్షణ మానిటరింగ్ అంతా కూడా స్టేషన్ నుండే జరుగుతుందని తెలిపారు

### మణిబాబు మృతికి సంతాపం

**విశాలాంధ్ర-పెదపారుపూడి** : మండలంలోని దోసపాడు గ్రామానికి చెందిన సాగునీటి సంఘం డిస్ట్రిబ్యూషన్ కమిటీ(డిసి) మాజీ చైర్మన్, ప్రస్తుత సాగునీటి సంఘం దోస పాడుశాఖ అధ్యక్షుడు గుండపనేని శ్రీనివాసరావు సోదరుడు శివ ప్రసాద్ తనయుడు గుండపనేని మణిబాబు (43) సంవత్సరాలు అనారోగ్యంతో మృతి చెందిన విషయం తెలుసుకున్న టిడిపి పామర్రు నియోజకవర్గ ఎస్ సి విభాగం ప్రధాన కార్యదర్శి దగాని లెనిన్ బాబు, టిడిపి సీనియర్ నేత సజ్జ శివకుమార్, తదితర నాయకులు బంధువులు, స్నేహితులు దోసపాడులోని మృతుని స్వగృహంలో మృతదేహాన్ని సందర్శించి నివాళులర్పించి మృతుని కుటుంబ సభ్యులను మంగళవారం పరామర్శించారు.

## పాఠశాలల్లో ఆకస్మిక తనిఖీ చేసిన కలెక్టర్ బాలాజీ

**విశాలాంధ్ర బ్యూరో మచిలీపట్నం :** మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి అందరూ సిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ అధికారులకు సూచించారు. మెగా పిటిఎమ్ నిర్వహించనున్న నేపథ్యంలో నగరంలోని పాఠశాలలను జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ ఆకస్మిక తనిఖీ చేసి ఏర్పాట్లను పరిశీలించారు. ప్రధానోపాధ్యాయులతో ముఖాముఖి మాట్లాడి చేపట్టవలసిన అంశాలపై దిశ నిర్దేశం చేశారు. నగరంలోని రాజ్‌పేట నగరపాలక సంస్థ ప్రత్యేక ప్రాథమిక ఉన్నత పాఠశాలను కలెక్టర్ సందర్శించారు. పాఠశాలలోని విర్యార్థులకు నిర్వహిస్తున్న ఫౌండేషన్ లిటరసి న్యూమరసి బేస్ లైన్ పరీక్షలను పరిశీలించారు. అనంతరం దేశాయిపేట లోని నగరపాలక సంస్థ ఉన్నత పాఠశాలలో కేంద్ర ప్రభుత్వం సరఫరా చేసిన విజ్ఞానాన్ని కలిగించే జాదూయి, సితార వివిద పరికరాలను, క్రికెట్, ఫుట్బాల్ వంటి క్రీడా సామగ్రిని పరిశీలించారు. అనంతరం ఏర్పాట్లపై ఆరా మెగా పేరెంట్ టీచర్స్ సమావేశానికి సంబందించి విద్యార్థుల తల్లిదండ్రులు అందరికి సమాచారం అందించి నదీ లేనిది, మద్యాహ్న భోజనం ఏర్పాట్లు సజావుగా చేస్తున్నారా లేదా అని కలెక్టర్ ప్రధానోపాధ్యాయులను ఆరా తీశారు. ఈ పర్యటనలో జిల్లా కలెక్టర్ డీకె. బాలాజీ వెంట డిప్యూటీ ఈఓ శేఖర్ సింగ్, ఎంఈఓ లు దుర్గాప్రసాద్, గురుప్రసాద్, శోభారాణి, ప్రధానోపాధ్యాయులు శ్రీనివాస రావు, పిఆర్పి యూనస్, పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# 5న మెగా పీటీఎం 3.0

-ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా ఏర్పాట్లు...

- పాల్గొనన్ను ప్రజాప్రతినిధులు, విద్యార్థుల తల్లిదండ్రులు..

- విద్యాశాఖ అధికారులతో కలెక్టర్ జి.లక్ష్మీశ

**విశాలాంధ్ర-విజయవాడ:** స్వర్ణాంధ్ర లక్ష్యాలు, విద్యా రంగ సంస్కరణలకు అనుగుణంగా ప్రభుత్వం తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, పాఠశాల మధ్య సంబంధాలను బలోపేతం చేస్తూ విద్యార్థుల సమగ్ర వికాసం లక్ష్యంగా ఈ నెల 5న మెగా పీటీఎం 3.0 నిర్వహిస్తున్నట్లు జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ తెలిపారు. మెగా పీటీఎం 3.0 సన్నద్ధతపై కలెక్టర్ మంగళవారం కలెక్టరేట్ శ్రీ పింగళి వెంకయ్య సమావేశ మందిరంలో ఎంఈవోలు, ఇంటర్మీడియెట్ అధికారులతో ప్రత్యక్షంగా పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో వర్చువల్‌గా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ మెగా పీటీఎం స్ఫూర్తికి అనుగుణంగా కార్యక్రమం నిర్వహణకు పకడ్బందీ ఏర్పాట్లు చేయాలని, అకడమిక్‌గా విద్యార్థుల సమగ్ర ప్రగతి నివేదికల పై ముఖాముఖి చర్చించి, భవిష్యత్తు కార్యాచరణ రూపొందించడంపై దృష్టిసారించాలన్నారు. పాఠశాలల్లో ఈ ఏడాది కొత్తగా అసెస్‌మెంట్ బుక్‌లెట్‌ను ప్రవేశపెట్టారని, ఇందులో పిల్లలు పరీక్షలు ఎలా రాశారు.. వారు సాధించిన పురోగతి, పొందిన ఫలితాలు ఇవన్నీ ప్రోగ్రెస్ కార్డులో ఉంటాయన్నారు. ఈ సమావేశంలో డీఈవో యూవీ సుబ్బారావు, జిల్లా ఇంటర్మీడియెట్ విద్యాధికారి బి.ప్రభాకర్, సమగ్ర శిక్ష ఏపీసీ ఎం.రజనీకుమారి, ఎంఈవోలు తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ప్రారంభమైన డోకిప్రరు బ్రహ్మోత్సవాలు

**విశాలాంధ్ర - గుడివాడ :** గుడ్లవల్లేరు మండలంలోని డోకిపర్రు మహాక్షేత్రంలో వేంచేసిన శ్రీ భూ సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దేవస్థానంలోని శ్రీ వేంకటేశ్వర స్వామి వారి దశమ వార్షిక సాలకట్ల బ్రహ్మోత్సవాలు మంగళవారం అత్యంత వైభవోపేతంగా ప్రారంభమయ్యాయి. ఆలయ వ్యవస్థాపక ధర్మకర్తలు పురిటిపాటి వేంకటకష్ణారెడ్డి, సుధారెడ్డి దంపతుల పర్యవేక్షణలో నిర్వాహకులు కొమ్మారెడ్డి బాపిరెడ్డి, విజయ భాస్కరమ్మ, పి.నాగిరెడ్డి, ప్రసన్న, పి.వి.సుబ్బారెడ్డి, సుమలత ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాలను చేపట్టారు. ఉత్సవాల ప్రారంభ సూచకంగా ఆలయంలోని ఉత్సవ మూర్తులకు వేద పండితులు విశేషస్నపన తిరుమంజనం నిర్వహించారు. ఉత్సవాల తొలి రోజు స్నపన తిరుమంజనం, సేనాధిపతి ఉత్సవం, అంకురారోపణ, వాహనం(తిరుచ్చి), పల్లకీ సేవ నిర్వహించారు. ఏడు కొండల వెంకటేశ్వర స్వామికి తిరుమలలో మాదిరిగా బ్రహ్మోత్సవాలు డోకిపర్రులో కూడా నిర్వహిస్తున్నట్లు ఆలయ ప్రధాన ఆచార్యులు శ్రీధర్ వివరించారు. డిసెంబర్ ఐదో తేదీ వరకు ప్రతిరోజు విశేష హెూమాలు, ఉత్సవాలు, ఊంజల, వాహన సేవలు బ్రహ్మోత్సవాల్లో భాగంగా జరుగుతాయి.

### సూర్యప్రభ వాహనంపై దేవదేవుడి విహారం

డోకిపర్రు మహాక్షేత్రంలో శ్రీ వేంకటేశ్వర స్వామి బుధవారం సూర్యప్రభ వాహనంలో విహరించనున్నారు. ఆలయంలో ధ్వజారోహణ కార్యక్రమం బుధవారం ఉదయం వేడుకగా జరుగుతుంది. అనంతరం సూర్యప్రభ వాహనంలో శ్రీ వేంకటేశ్వరుడు విహరిస్తారు. అనంతరం శేష వాహనోత్సవం, సాయంత్రం ఊంజల సేవ, హంస వాహనోత్సవం, ఏకాంతసేవ నిర్వహిస్తారు.

## కేసులు సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదం

-న్యాయమూర్తి ఏ సత్యానంద

**విశాలాంధ్ర-విజయవాడ:** వివిధ కేసులు సత్వర పరిష్కారానికి లోక్ అదాలత్ దోహదపడుతోందని రెండవ అదనపు జిల్లా న్యాయమూర్తి ఏ సత్యానంద తెలియజేశారు. మెగా లోక్ అదాలత్ నిర్వహరణ సందర్భంగా మంగళవారం బెజవాడ బార్ అసోసియేషన్‌కు ఆయన విచ్చేసి లోక్ అదాలత్ ఆవశ్యకతను న్యాయవాదులకు వివరించారు. రోజురోజుకు పెరుకుపోతున్న కేసులను న్యాయవాదులు సహకరించి వారి కక్షిదారుల మధ్య సఖ్యతను కుదిర్చి కేసులను పొడిగించకుండా లోకదాలతో రాజీ చేయాలని సూచించారు. ఈ కారణంగా మానవ సంబంధాలు మెరుగుపడతాయని నవ సమాజాన్ని నిర్మించవచ్చు అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి కమర్షియల్ కోర్టు న్యాయమూర్తి భూపాల్ రెడ్డి, 12వ అదనపు జిల్లా న్యాయమూర్తి సునీల్ కుమార్, బెజవాడ న్యాయవాదుల సంఘం అధ్యక్షుడు ఏకే భాషా హాజరయ్యారు.

**CHANGE OF SURNAME**

I, SEENIAH VENKATESWARALU (Old Surname), S/o. Soda Seenaiah, R/o. D.No. 26-20-37, Swamy Street, Gandhi Nagar, Vijayawada - 520003, A.P.

I have changed my Surname **SODA VENKATESWARALU** (New Surname). Hereafter my Surname is known as **SODA VENKATESWARALU** S/o. Soda Seenaiah.

**CHANGE OF NAME**

I **Chithirala Padmaja**, W/o (Late) Chithirala Haranath, resident of D.No. 1-1/6-39/23, Lotus Legend Apartments, E-11, Kummaripalem Center, Vidhyadharapuram, Vijayawada-520012, NTR District, A.P. I changed my son name **CHITHIRALA ADI VEERA VENKATA KUSUMA SIVA MANIKANTA EVAN** (Old Name) to **CHITHIRALA MANIKANTA YUVAN**. Hereafter my Son Name is known as **CHITHIRALA MANIKANTA YUVAN.**

## ఎన్నికలకు ముందు తొలగించిన పేర్లను మళ్లీ రాయాలని వినతి

**విశాలాంధ్ర-మంగళగిరి :** పట్టణంలోని రాజీవ్ గృహకల్ప సముదాయంలో అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆరు మగ్గాల షెడ్యూల్‌పై ఉన్న పేర్లను తొలగించారు. తొలగించిన పేర్లను మరలా రాయాలని కోరుతూ మంగళవారం తాడేపల్లి నగరపాలక సంస్థ కమిషనర్‌ను చేనేత కార్మిక సంఘాల సమన్వయ కమిటీ ఆధ్వర్యంలో కలిసి వినతిపత్రాన్ని అందజేశారు.

**CHANGE OF NAME**

I, **SHAMEEN** (Old Name) W/o. **SYED KARIMULLA RAZVI AHMED** resident of Door.No.32-15-110/3, Flat No. 502, Rathnamamba Street, Kutumba Enclave, Moghalrajpuram, Vijayawada, NTR District, Andhra Pradesh. I have change my name from **SHAMEEN** (Old Name) to **SHAMIM RAHIMA** (New Name). Hereafter my name is known as **SHAMIM RAHIMA** (New Name) W/o **SYED KARIMULLA RAZVI AHMED** for all purpose.

**CHANGE OF SURNAME**

I, **IRFAN AHAMAD MOHAMMED**, (Old Name) ,S/o **KHURSHEED AHAMAD MOHAMMED**, resident of flat No:SF-6, Anupama Apartments, Opp. SS Convention Hall, Labbipet, Vijayawada, NTR District, Andhra Pradesh. I have changed my surname from **IRFAN AHAMAD MOHAMMED** (Old Name) to **IRFAN AHAMAD MOHAMMAD** (New Name) S/o **KHURSHEED AHAMAD MOHAMMED**. Hereafter my name is known as **IRFAN AHAMAD MOHAMMAD** (New Name), S/o **KHURSHEED AHAMAD MOHAMMED** for all purpose

**మార్కుల మెమో పోయినవి**

తిరువూరు మండలం పాత తిరువూరు గ్రామ కాపురస్తురాలు **కొత్తపల్లి నాగేశ్వరి, తండ్రి: చిన్నపుల్లయ్య** వ్రాసుకొను విన్నపమునా బీఎస్సీ డిగ్రీ ప్రొవిజనల్ మరియు మార్కుల మెమో కనిపించనందున ఎవరికైనా దొరికితే తిరిగి ఇవ్వగలరు. **ది.01.10.2025వ తేదీన** నా డిగ్రీ ప్రొవిజనల్ సర్టిఫికెట్ మార్కుల మెమోలను జిరాక్సు తీయించు నిమిత్తం మా ఇంటినుంచి మెయిన్ రోడ్డులోని జిరాక్సు సెంటరుకు వచ్చుచుండగా, నా సర్టిఫికెట్ల కవరు జారిపడిపోయినది. సదరు సర్టిఫికెట్ల కొరకు ఎంతగా వెదకినను కనిపించలేదు. దొరికిన వారు నా ఫోన్ నెంబరుకు తెలుపగలరు.

సెల్ నెం. **9951779154**

**ప్రకటన**

నా క్లయింటు సింగరాజు శివ ప్రసాద్, తండ్రి రామచంద్రరావు, పోతేపల్లి గ్రామము, మచిలీపట్నం మండలం, కృష్ణ జిల్లా గారి సంజాయిషీ పొంది తెలియజేయునది ఏమనగా.. నా క్లయింటు స్వార్జితమైన ఆస్థి ది.05-06-2009 తేదీన గుడివాడ సబ్ రిజిస్ట్రార్ ఆఫీసులో ఒక క్రయ దస్తావేజు నెం. 2016/2009 గా రిజిస్టర్ చేయించుకుని వున్నారు. ది.22-09-2025 న దాని తాలూకు ఒరిజినల్ దస్తావేజులు తీసుకుని ఫోటోస్టాట్ తీయించు నిమిత్తము తన ఇంటి నుంచి బయలు దేరి వెళ్ళుచుండగా, బొమ్ములూరు సెంటర్, గుడివాడ లో ఒక ఒరిజినల్ లింకు డాక్యుమెంట్ క్రయ దస్తావేజు నెం. 1582/2008 తేదీ : 04-04-2008 జారి పడిపోయినది. ఎంత వెతికిననూ కనబడలేదు. కాగా ఈ ఆస్థిని నా క్లయింటు ఇంతకు ముందు ఎవ్వరికీ అన్యాక్రాంతము కానీ, తనఖా కానీ చేసి యుండలేదు. పూర్తిగా అతని స్వాధీన అనుభవములోనే వుండి వున్నది. కాబట్టి ఆ లింకు డాక్యుమెంట్ మీద ఏ విధమైన తనఖాలుగానీ, ఏ విధమైన చర్యలకు పాల్పడిననూ అవి చెల్లవు అని తెలియజేయు చున్నాము.. ఆ డాక్యుమెంట్ ఎవరికైనను దొరికినచో ఈ క్రింది అడ్రస్సు మరియు ఫోన్ నెంబర్ ను సంప్రదించగలరు.

**కలపాల కుమార స్వామి**
న్యాయవాది,
డోర్ నెం. 24-25-73, 2వ క్రాస్ రోడ్,
బాలాజీ నిలయం, దుర్గాపురం,
విజయవాడ -520003.
ఫోన్: 9494562944,8688999260
విజయవాడ, తేది:02-12-2025

# ఎన్టీఆర్ స్టేడియంలో స్కూల్ గేమ్స్ కబడ్డీ నేషనల్స్

## సమీక్ష నిర్వహించిన ఎమ్మెల్యే వెనిగండ్ల రాము

**విశాలాంధ్ర-గుడివాడ :** గుడివాడ పట్టణంలోని ఎన్టిఆర్ స్టేడియంలో అండర్ - 14 జాతీయ స్థాయి కబడ్డీ పోటీలు నిర్వహిస్తున్నట్లు ఎమ్మెల్యే వెనిగండ్ల రాము తెలిపారు. మంగళవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జాతీయ స్థాయి కబ్బడీ పోటిల నిర్వహణపై ఎమ్మెల్యే వెనిగండ్ల రాము సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా, ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ఆధ్వర్యంలో జనవరి 19వ తేదీ నుండి ఐదు రోజులపాటు జరగుతాయన్నారు. జాతీయ స్థాయిలో ప్రతిష్టాత్మకంగా గుడివాడలో జరుగుతున్న పోటీలకు వచ్చే క్రీడాకారులు, కోచ్‌లు, ఫెడరేషన్ పెద్దలకు ఇచ్చే ఆతిథ్యం, రవాణా, వసతి ఏర్పాట్లపై మున్సిపల్ స్పెషల్ ఆఫీసర్, ఆర్డీవో బాలసుబ్రమణ్యం, మున్సిపల్ కమిషనర్ మనోహర్ చర్చించారు. జాతీయస్థాయి పోటీలు నిర్వహించే అవకాశం గుడివాడకు రావడం సంతోషకరమన్నారు. పోటీల్లో దేశం లోని వివిధ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంతాల నుండి 45 జట్లు వస్తాయని అంచనా వేస్తున్నామన్నారు. క్రీడాకారులకు ఇబ్బందులు తలేత్తకుండా పోటీల నిర్వహణపై ప్రణాళికలు రూపొందిస్తున్నామన్నారు. ఎన్టీఆర్ స్టేడియం సహకారంతో నిర్వహించే పోటీల విజయవంతానికి క్రీడాభిమానులు, దాతలు తమ వంతు సహకారం అందించాలన్నారు. ఈ సమావేశంలో మున్సిపల్ ఎం.ఈ ప్రసాద్, జాతీయ స్థాయి పోటీల నిర్వహణ కార్యదర్శి ఎస్.గంగాధర్, కమిటీ సభ్యులు ఎన్.రవిబాబు, బి.అనిల్, యం రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

## ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ప్రోత్సాహం

**విశాలాంధ్ర-చల్లపల్లి :** ఔత్సాహిక పారిశ్రామికవేత్తలను ప్రోత్సహించేందుకు, వివిధ రాయితీలు అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం అడుగులు వేస్తోందని జిల్లా పరిశ్రమల ప్రోత్సాహక అధికారి వై.నాగేంద్రభూపాల్, చల్లపల్లి ఎంపీడీవో ఆనందకుమారిలు అన్నారు. చల్లపల్లి మహిళా సమాఖ్య భవనం లో మండలస్థాయి ఉద్యం రిజిస్ట్రేషన్ అవగాహనా సదస్సు మంగళవారం నిర్వహించారు. ప్రభుత్వం అందించు సహకారం ఉపయోగించుకుని ప్రతి ఇంటి నుంచీ ఒకరు పారిశ్రామికవేత్తగా మారి లబ్ధిపొందాలని సూచించారు. డీఆర్డీఏ ఏపీఎం కె.శ్రీనివాస్, సీసీలు, వ్యాపారులు తదితరులు పాల్గొన్నారు.

## దళారులను నమ్మి మోసపోవద్దు తహసీల్దార్ సూచన

**విశాలాంధ్ర-చల్లపల్లి :** కృష్ణాజిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు చల్లపల్లి మండలంలో 25, 26 శాతం తేమశాతం ఉన్న వరి ధాన్యాన్ని సైతం ప్రభుత్వ నిబంధనలు (ఎఫ్ఎక్యు నిబంధనలు) అనుసరించి ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా కొనుగోలు చేయటం జరుగుతుందని చల్లపల్లి తహసీల్దార్ డి.వనజాక్షి తెలిపారు. ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సరిపడా గోనెసంచులు, వాహనాలు అందుబాటులో ఉన్నాయనీ, దళారుల మాటలు నమ్మి రైతులు తమ ధాన్యాన్ని మద్దతు ధర కంటే తక్కువకు అమ్ముకోవద్దని కోరారు. కొంతమంది దళారులు ధాన్యం కొనుగోలు కేంద్రాలతో సంబంధం లేకుండా ఆఫ్లైన్లో రైస్మిల్లర్లకు అమ స్మితామంటూ రైతులకు మాయమాటలు చెప్పి ధాన్యం తక్కువ ధరకు కొనుగోలు చేస్తున్నారని తెలుస్తోం దన్నారు. ఎక్కడా ఆఫ్లైన్లో ధాన్యం కొనుగోలు జరగటంలేదనీ, ప్రభుత్వ ధాన్యం కొనుగోలు కేంద్రాల ద్వారా మాత్రమే ధాన్యం కొనుగోలు జరుగుతున్నట్లు తెలిపారు. ఏ ఒక్క రైతు దళారుల మాటలకు మోస పోవద్దని తెలియచేశారు. మంగళవారం తహసీల్దార్ పలు ధాన్యం కొనుగోలు కేంద్రాలను సందర్శించి సీఈవోలు, సిబ్బందికి సూచనలు అందించారు.

## డిప్యూటీ ఎంపీడీఓగా బాధ్యతలు తీసుకున్న పూర్ణ

**విశాలాంధ్ర-పెదపారుపూడి :** గ్రామ, వార్డు సచివాలయాల డిప్యూటీ ఎంపీడీవో గా బాధ్యతలు తీసుకున్న పి పూర్ణచంద్రరావు ను ఎంపీడీవో జె విమాదేవి, డిప్యూటీ ఎంపీడీవో వంగ శ్రీనివాస్ (వంశీ), పంచాయితీ కార్యదర్శులు ఈశ్వరి కుమారి, సుబ్రహ్మణ్యం, విజయ్ కుమార్, సీనియర్, జూనియర్ అసిస్టెంట్లు బేగం, స్వరూప్ లు మంగళవారం అభినందించారు.

## టెంట్ల కింద ధాన్యాన్ని నిల్వ చేసిన రైతు

**విశాలాంధ్ర-కూచిపూడి :** ద్విత్వా తుపానుతో గత రెండు మూడు రోజులుగా కురుస్తున్న వర్షపు జల్లుల నుంచి షామియానా టెంట్లు వేయించి ధాన్యాన్ని తడవకుండా కాపాడుకోవడంలో కొంత మంది రైతులు నిమగ్నమయ్యారు. మంగళవారం ఉదయం నుంచి కురుస్తున్న వర్షపు జల్లులతో మొవ్వలో రైతులు ఈ సాంప్రదాయానికి తెరలేపారు. ఆరుగాలం శ్రమించిన రైతులకు పంట చేతికి అందే తసమాచారంప్రకృతి పగబట్టడంతోఏమీ చేయలేని నిస్సహాయ స్థితిలో రైతులు ఈ విధమైన చర్యలకుచేపట్టారు. అటు ప్రభుత్వాన్ని ఇటు కొనుగోలుదారులనుఅడిగినా ప్రయోజనం లేని ఈ తరుణంలో ఖర్చుకు వెనకాడక వాటర్ ప్రూఫ్ టెంట్లువేయించుకొని కాపాడుకుంటున్నారు.

## మొవ్వ మండల డిప్యూటీ ఎంపీడీవో గా శ్రీలక్ష్మి

**విశాలాంధ్ర-కూచిపూడి :** మొవ్వ మండల జి.ఎస్.డబ్ల్యూ. ఎస్ డిప్యూటీ ఎంపీడీవోగానెమలికంటి శ్రీలక్ష్మి బాధ్యతలు చేపట్టి నట్లు ఎంపీడీవో దయాల సుహాసిని మంగళవారం తెలిపారు. కోసూరు గ్రామపంచాయతీ గ్రేడ్ -1 కార్యదర్శిగా విధులు నిర్వహిస్తూ పదోన్నతిపై బదిలీ అయ్యారు. ఎంపీడీఓ, డిప్యూటీ ఎంపీడీవో త్రినాథ్, ఎంపీపీ కొండేటి ఇందిరా చందు దంపతులు అభినందించారు. కోసూరు పంచాయితీ కార్యదర్శి నియామకం జరిగే వరకు ఆ పంచాయతీకి ఇన్చార్జిగా. కొనసాగుతారు.

## తెలుగు విశ్వవిద్యాలయం వ్యవస్థాపక దినోత్సవం

**విశాలాంధ్ర -కూచిపూడి :** పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 40వవ్యవస్థాపకదినోత్సవ వేడుకలు కూచిపూడి శ్రీ సిద్ధేంద్ర యోగి నాట్య కళాపీఠంలో మంగళవారం నిర్వహించారు. పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం ఆంధ్రప్రదేశ్ కు ప్రధాన కేంద్రమైన రాజమహేంద్రవరంలో తొలిసారిగా నిర్వహించే ఈ వేడుకలకు కూచిపూడి కళాపీఠం వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ చింతా రవి బాలకృష్ణ శిష్య బృందంతో నాట్య ప్రదర్శనలు నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం శ్రీనివాసరావు సూచనలతో కూచిపూడి లో నిర్వహించిన ఈ కార్యక్రమంలో భాగంగా తెలుగు తల్లి విగ్రహంవద్ద ఏర్పాటుచేసినపొట్టిశ్రీరాములుచిత్రపటానికి అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ ఏలేశ్వరపు శ్రీనివాసులు పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరంఆయన ఆధ్వర్యంలో విద్యార్థినులతో నాట్య ప్రదర్శన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు సీనియర్ అసిస్టెంట్ వెంకటేశ్వరరావు, టీచింగ్ అసిస్టెంట్స్ డాక్టర్ వేదాంతంవెంకటదుర్గాభవాని(సంగీతం), పసుమర్తి హరినాథ శాస్త్రి(మృదంగం), గ్రంథాలయ పాలకులు ఏలేశ్వరపు వేంకటేశ్వరఫణికుమార్ సిబ్బంది, ఎం పి ఏ, సర్టిఫికెట్ కోర్స్ విద్యార్థులు పాల్గొన్నారు.

# ప్రజల క్షేమం, నగరాభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ ఉండాలి

## నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర

**విశాలాంధ్ర-విజయవాడ కార్పొరేషన్ :** ప్రజల క్షేమమే ధ్యేయంగా, నగరాభివృద్ధి లక్ష్యంగా బడ్జెట్ ఉండాలని నగర పాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. వీఎంసీ కార్యాలయంలో కమిషనర్ చాంబర్‌లతో కమిషనర్ వివిధ శాఖాధిపతులతో 2026-27 బడ్జెట్ అంచనాలపై మంగళవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో రెవెన్యూ, క్యాపిటల్, ఆదాయం, ఖర్చుపై సమీక్షించారు. నగరాభివృద్ధికి శాఖల వారిగా వారికి అయ్యే ఖర్చు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ ప్రజల క్షేమం, నగరాభివృద్ధి కోసం చేసే అభివృద్ధి కార్యక్రమాలు, నగర స్వచ్ఛత, ప్రజారోగ్యానికి ప్రాముఖ్యత ఇవ్వాలని అన్నారు. ఈ సమావేశంలో అసిస్టెంట్ కలెక్టర్ ఫర్హీన్ జాహిద్, అడిషనల్ కమిషనర్ డాక్టర్ డి.చంద్రశేఖర్, చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్ రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు, చీఫ్ ఇంజనీర్ ఇంచార్జ్ పి.సత్యకుమారి, డిప్యూటీ కమిషనర్ జి.సృజన, ఎస్టేట్ ఆఫీసర్ ఏ.శ్రీధర్, డీఎఫ్ఓ మల్యాద్రి, పర్యవేక్షణ ఇంజనీర్ ఇన్చార్జ్ ఏ.శ్రీనివాస్‌రెడ్డి, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, జాయింట్ డైరెక్టర్ (అమృత్) డాక్టర్ లత, యుసిడి పివో వెంకటనారాయణ, అకౌంట్ ఎగ్జామినర్ చక్రవర్తి, అకౌంట్స్ ఆఫీసర్ బి.సత్యనారాయణమూర్తి పాల్గొన్నారు.

### పారిశుధ్యాన్ని మెరుగుపర్చాలి

నగరంలో పారిశుధ్యాన్ని మెరుగుపర్చే క్రమంలో మీకేం అవసరమైన నిర్భయంగా చెప్పాలని నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర పారిశుధ్య కార్మికులకు భరోసా ఇచ్చారు. నగర పర్యటనలో భాగంగా కమిషనర్ రామకృష్ణాపురం, అజిత్‌సింగ్ నగర్, ఇన్నర్ రింగ్ రోడ్డు, ఉడా కాలనీ, రాజీవ్‌నగర్ ప్రాంతాల్లో మంగళవారం పరిశీలించారు. రామకృష్ణాపురంలో పారిశుధ్య కార్మికులతో మాట్లాడి వారికి పారిశుద్ధ్య నిర్వహణకు ఎలాంటి ఇబ్బందులు ఉన్న తనకు తెలుపవచ్చని, పారిశుధ్య నిర్వాహణకు ఉపయోగించే పనిముట్లు, తోపుడు బళ్ళు బావున్నాయా అని అడిగారు. రాజీవ్‌నగర్, ఉడా కాలనీ రోడ్‌లో సైడ్ డ్రెయిన్లలో వ్యర్థాలు తక్షణమే తొలగించేందుకు చర్యలు తీసుకోవాలని, నగరంలో సైడ్ డ్రెయిన్లు, డివైడర్లు, రోడ్లపైన పారిశుధ్య నిర్వహణ సక్రమంగా జరగాలని, ప్రత్యేకంగా సైడ్ డ్రెయిన్లలో వ్యర్థాలు తొలగించడంపైన దృష్టి సారించాలని ఆదేశించారు. జోనల్ కమిషనర్ కే.ప్రభుదాస్, అసిస్టెంట్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ బాబు శ్రీనివాసన్, సిబ్బంది పాల్గొన్నారు.

## రైతు కుటుంబానికి ఆర్థిక చేయూత

**విశాలాంధ్ర -వీరులపాడు:** మండలంలోని నరసింహారావు పాలెం గ్రామానికి చెందిన రైతు గుర్రాల కోటిరెడ్డి ఇటీవల అనారోగ్యంతో మృతి చెందాడు. మృతుడు జుజ్జురు కోఆపరేటివ్ సొసైటీ నందు సభ్యుడిగా ఉండి పంట రుణాలు తీసుకుని ఉన్నాడు. దీనితో మృతిని భార్య గుర్రాల కోటమ్మకు మంగళవారం దహన ఖర్చుల నిమిత్తం జుజ్జూరు కో-ఆపరేటివ్ సొసైటీ ప్రెసిడెంట్ షేక్ రహమతుల్లా, జనసేన పార్టీ నాయకులు బొమ్మిశెట్టి భాస్కర రావు, కూటమి నాయకులు కలసి పదివేల రూపాయలు అందజేశారు.

## హరే రామ నామ సప్తాహ మహోత్సవాలు

**విశాలాంధ్ర-గంపలగూడెం :** మండలంలోని మేడూరులోని శ్రీ వీరాంజనేయ స్వామి వారి దేవస్థానం నందు 48వ హరే రామ నామ సప్తాహ మహోత్సవాల్లో మంగళవారం ద్వాదశిసందర్భంగా ఆలయఅర్చకులు కోమందూరి. ఆంజనేయచార్యులు శ్రీ వీరాంజనేయ స్వామి వారికి ప్రత్యేక అలంకరణ గావించి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా హనుమాన్ చాలీసా శ్రీ రామ యోగేంద్ర భక్త బృందం ముత్యాల వెంకటేశ్వర్లు వారు నిర్వహించారు. ఆలయ కార్యనిర్వాణాధికారి వన్నెంరెడ్డి. దుర్గా ధన ప్రసాద్, గ్రామ పెద్దలు, భక్తులు అధికసంఖ్యలో పాల్గొన్నారు. మహాఅన్నప్రసాద వితరణ చేశారు.

## సాధారణ ప్రసవాలకు ప్రాధాన్యత ఇవ్వాలి

**విశాలాంధ్ర, కూచిపూడి :** ఆశా వర్కర్లు గ్రామాలలో గర్భవతులకు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యత గురించి అవగాహన కల్పించాలని మొవ్వ ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రం వైద్య అధికారిణి డాక్టర్ సిహెచ్ రాజేశ్వరి సూచించారు.మొవ్వ ప్రాథమిక వైద్య ఆరోగ్యకేంద్రం లోమొదటి మంగళవారం ఆశా డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొవ్వ వైద్యాధికారిణిడాక్టర్ సిహెచ్ రాజేశ్వరి అధ్యక్షతన గర్భవతులు, బాలింతలు గురించి ఆశా కార్యకర్తలకు, ఏఎన్ఎం లకుపలు సూచనలు చేశారు. ప్రతి ఆశా వర్కర్ తన గ్రామ పరిధిలో ఉన్న గర్భవతులు, బాలింతలకు తల్లిపాల ప్రాధాన్యత గురించి, అదనపు పౌష్టికాహారం గురించి వివరించాలని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో పీ. హెచ్.ఎన్. డి శ్రీలక్ష్మి, సూపర్వైజర్ డి విజయకుమార్, ఆరోగ్య కార్యకర్తలు ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## 6న నెమలి దేవస్థానం హుండీల లెక్కింపు

**విశాలాంధ్ర-గంపలగూడెం :** నెమలి గ్రామములో వేంచేసియున్న శ్రీ వేణుగోపాలస్వామి దేవస్థానంలోని హుండీలలో భక్తులు సమర్పించిన కానుకలు ఈనెల 6వ తేదీ శనివారము రోజున లెక్కింపు కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఆలయా అసిస్టెంట్ కమిషనర్ మరియు కార్ నిర్వహణ అధికారిని నేల. సంధ్య మంగళవారం తెలిపారు.

## కృష్ణాజిల్లా మైనార్టీ మోర్చా ఉపాధ్యక్షుడిగా రఫీ



**విశాలాంధ్ర-గన్నవరం :** కృష్ణాజిల్లా మైనార్టీ మోర్చ ఉపాధ్యక్షుడిగా మహ్మద్ రఫీ ఎన్నికయ్యారు గన్నవరం మండలం మానికొండ గ్రామానికి చెందిన షేక్ మహమ్మద్ రఫీ కి కృష్ణాజిల్లా మైనార్టీ మోర్చా అధ్యక్షులు షేక్ చిన్న మంగళవారం మంగళవారంపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా షేర్ చిన్న మాట్లాడుతూ ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలో బిజెపిలో మైనార్టీలకు సముచిత స్థానం కల్పిస్తుందని ఆయన తెలిపారు పార్టీలోనే కాకుండా క్రింద స్థాయి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వంలో నామినేట్ పదవుల్లో మైనార్టీలకు సముచిత స్థానం కల్పిస్తున్న పార్టీ బిజెపి మాత్రమేనని ఆయన స్పష్టం చేశారు. మైనార్టీలు పెద్ద సంఖ్యలో బిజెపిలో చేరుతున్నారని బిజెపి పై మైనార్టీలకు పూర్తిగా విశ్వాసం ఉందని ఆయన తెలిపారు. ఈ కార్యక్రమంలో బిజెపి మైనార్టీ మోర్చి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# పర్యావరణ సంరక్షణతోనే ప్రజా ఆరోగ్యం

విశాలాంధ్ర-గుంటూరు కలెక్టరేట్ : జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవాన్ని పురస్కరించుకుని విజ్ఞాన్స్ యూనివర్సిటీ ఆధ్వర్యంలో నారాకోడూరు సెంటర్‌లో కమ్యూనిటీ అవుట్‌రీచ్ కార్యక్రమాన్ని నిర్వహించామని వర్సిటీ వైస్ చాన్సలర్ కల్నల్, ప్రొఫెసర్ పి.నాగభూషణ్ మంగళవారం తెలిపారు. 'పొల్యూషన్ ప్రివెన్షన్ – సేఫ్ ఎన్విరాన్‌మెంట్' అనే అంశంపై ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి 'సస్టెయినబుల్ లివింగ్ ఫర్ గ్రీనర్ ఫ్యూచర్' అనే థీమ్‌ను నిర్ణయించామన్నారు. ఈ కార్యక్రమాన్ని కెమిస్ట్రీ విభాగం, యూనివర్సిటీ ఎక్స్‌టెన్షన్ యాక్టివిటీ కౌన్సిల్ విభాగాల సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారని తెలియజేసారు. పర్యావరణ కాలుష్యం పెరుగుతున్న నేపథ్యంలో ప్రతిఒక్కరూ పర్యావరణ పరిరక్షణలో భాగస్వాములవ్వాలని పిలుపునిచ్చారు. జీవనశైలిలో చిన్నచిన్న మార్పుల ద్వారా పచ్చని భవిష్యత్తును నిర్మించవచ్చని స్పష్టం చేశారు. వనరుల అధిక వినియోగం, ప్లాస్టిక్ కాలుష్యం, పరిశ్రమల పెరుగుదల వలన పర్యావరణానికి తీవ్రమైన నష్టం జరుగుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. సస్టెయినబుల్ లివింగ్ అంటే అవసరమైనంత మాత్రమే వనరులను వాడుతూ, పునర్వినియోగం, రీసైక్లింగ్ వంటి పద్ధతులను అమలు చేయడం ద్వారా రాబోయే తరాలకు భూమి సంపదలను కాపాడాలని పేర్కొన్నారు. చిన్నచిన్న అలవాట్లతోనే పెద్ద మార్పు సాధ్యమని స్పష్టం చేశారు. జల సంరక్షణ, సోలార్ ఎనర్జీ వినియోగం, పర్యావరణ స్నేహపూర్వక ప్రయాణం, చెట్లు నాటడం, కంపోస్టింగ్, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించడం వంటి పచ్చని ఆచరణలు అమలు చేస్తే కాలుష్యం నియంత్రణ సాధ్యమని తెలిపారు. పర్యావరణ పరిరక్షణలో ప్రతిఒక్కరి బాధ్యత ఉన్నందున, నేటి నుంచే సస్టెయినబుల్ జీవనశైలిని అలవరుచుకుని పచ్చని భవిష్యత్ నిర్మాణానికి అందరూ తోడ్పడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఆయా విభాగాల డీన్లు, అధిపతులు, అధ్యాపక సిబ్బంది, విద్యార్థులు పాల్గొన్నారు.

## డ్రోన్ గస్తీతో బహిరంగ మద్యపానం గుర్తింపు

విశాలాంధ్ర-తెనాలి : కఠెవరం గ్రామంలోని డంపింగ్ యార్డ్ వద్ద బహిరంగంగా మద్యం సేవిస్తున్న ఐదుగురిని రూరల్ పోలీసులు గుర్తించారు. డ్రోన్ ద్వారా వారిని గుర్తించి అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్ఐ ఆనంద్ తెలిపారు. వారిని కోర్టులో హాజరు పరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.500 జరిమానా విధించారని ఎస్ఐ తెలిపారు. చట్టవ్యతిరేక చర్యలకు పాల్పడే వారిపై పోలీసు నిఘా ఉంటుందని చెప్పారు.

## ఫిలిం టూరిజం పాలసీ సినీ పరిశ్రమకు ఆక్సిజన్

విశాలాంధ్ర-తెనాలి : ప్రభుత్వం తీసుకువస్తున్న ఫిల్మ్ టూరిజం పాలసీ వలన వెంటిలేటర్‌పై నున్న సినీ పరిశ్రమకు ఆక్సిజన్ అందించినట్టేనని మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్ వ్యవస్థాపకులు, సినీ దర్శకుడు దిలీప్‌రాజా అన్నారు. తెనాలి మా-ఏపి కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ముంబైలో జరుగుతున్న సమ్మిట్‌లో మంత్రి దుర్గేష్ ఫిల్మ్ టూరిజం పాలసీని ప్రకటించడం హర్షణీయమన్నారు. పాలసీ అమలుకు ఆయా శాఖల నిపుణుల అభిప్రాయాలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో దర్శకుడు నరేష్, సహాయ దర్శకుడు సత్యవర్ధన్, సురేష్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

## విభిన్న ప్రతిభావంతుల్లో నైపుణ్యాలు దాగి ఉంటాయి: ముదిగొండ

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : అనేక కారణాల వల్ల విభిన్న ప్రతిభావంతులుగా జన్మించిన పిల్లలలో కనపడని ప్రతిభ పాటవాలు దాగి ఉంటాయని, సరైన శిక్షణతో అనేక మందిని తిరిగి జీవితంలో మసలేల తీర్చిదిద్దవచ్చునని త్రిగుణ నేచర్ క్యూర్ అండ్ యోగ క్లినిక్ నిర్వాహకురాలు డాక్టర్ ముదిగొండ ఉమా సుందరి అన్నారు. ప్రపంచ విభిన్న ప్రతిభావంతుల దినోత్సవం సందర్భంగా స్థానిక శ్యామల నగరు శివారు ప్రభాత సింధూరి రిహాబిలిటేషన్ సెంటర్‌లో విద్యార్థులకు ఆటలు, పాటలు నృత్యాలు, వివిధ వస్తువుల తయారీలు, సాంస్కృతిక కార్యక్రమాల పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న డాక్టర్ ఉమా సుందరి మాట్లాడుతూ ప్రకృతి జీవన విధానంలో సరి అయిన పౌష్టికాహారం, యోగ, శరీరక వ్యాయామాలు కావలసిన నైతిక మానసిక ధైర్యాన్ని..బలాన్ని అందిస్తాయన్నారు. గత 15 సంవత్సరాలుగా ప్రభాత సింధూరి రిహాబిలిటేషన్ సెంటర్ ద్వారా చక్కటి శిక్షణతో పాటు వారిలో ఉన్న నైపుణ్యాలను వెలికితీసే విధంగా కార్యక్రమాలు నిర్వహించటం అభినందనీయమని చెప్పారు. రిహాబిలిటేషన్ నిర్వాహకురాలు యామిజాల జయలక్ష్మి శ్రీనివాస్ మాట్లాడుతూ సంస్థ ద్వారా గత 15 సంవత్సరాలుగా వందలాది మంది విభిన్న ప్రతిభావంతుల సేవ చేసే అవకాశం భగవంతుని కృపగా భావిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ వై.సమీర్, ప్రిన్సిపల్ పి. అన్నపూర్ణ, ఉపాధ్యాయులు మల్లేశ్వరరావు, గీత, సుజాత, వెంకటమ్మ, తదితరులు పాల్గొన్నారు.

## డిపాజిట్ల కుంభకోణంపై దర్యాప్తు ముమ్మరం

విశాలాంధ్ర-మంగళగిరి : కురగల్లులోని ప్రాథమిక వ్యవసాయ పరపతి సంఘం (పీఏసీఎస్) కార్యాలయంపై దర్యాప్తును క్రైమ్ బ్రాంచ్ అధికారులు ముమ్మరం చేశారు. జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ ఆదేశాల మేరకు గుంటూరు క్రైమ్ బ్రాంచ్ డీఎస్పీ మధుసూదనరావు, మంగళగిరి టౌన్ సీఐ వీరాస్వామి, మంగళగిరి రూరల్ సీఐ ఏవీ బ్రహ్మం కలిసి కార్యాలయాన్ని సందర్శించారు. రికార్డులను శ్రద్ధగా పరిశీలించడంతో పాటు పీఏసీఎస్‌కు సంబంధించిన అంశాలపై రైతులతో మాట్లాడి వివరాలు సేకరించారు. కేసు దర్యాప్తును వేగవంతం చేస్తూ, నిందితులపై అన్ని కోణాల్లో విచారణ కొనసాగిస్తున్నట్లు వారు తెలిపారు. రైతులకు న్యాయం జరిగే విధంగా దర్యాప్తును మరింత ముందుకు తీసుకువెళ్తున్నామని సంబంధిత అధికారులు వెల్లడించారు.

## కమ్యూనిటీ హాల్‌కు స్థలం, నిధులు కేటాయించాలి

విశాలాంధ్ర-మంగళగిరి : రాజధాని ప్రాంతం నవులూరులో ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం ఆధ్వ ర్యంలో మంగళవారం ప్రెస్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా యాదవ సమాజ అభివృద్ధికి ప్రభుత్వం ప్రత్యేక చర్యలు తీసుకోవాలని నాయకులు కోరారు. యాదవ కమ్యూనిటీ అవసరాలను దృష్టిలో ఉంచుకుని ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించి, పది కోట్ల రూపాయల నిధులతో కమ్యూనిటీ హాల్‌ను నిర్మించాలని సంఘం ప్రతినిధులు డిమాండ్ చేశారు. యాదవ వర్గ సంక్షేమ కార్యక్రమాల విస్తరణ కోసం యాదవ కార్పొరేషన్‌కు ఆరు వేల కోట్ల రూపా యలు కేటాయించాల్సిన అవసరం ఉందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ యాదవ సంఘం అధ్యక్షులు, హైకోర్టు న్యాయవాది కుర్రా శ్రీనివాస్ యాదవ్, మంగళగిరి యాదవ సేన అధ్యక్షులు తోట శివరాంప్రసాద్ యాదవ్, కుర్ర పున్నారావు యాదవ్, రుద్ర వీరయ్య యాదవ్, బత్తుల శ్రీను యాదవ్, బత్తుల నాగరాజు యాదవ్, తోట నాగరాజు, బత్తుల హనుమంతరావు, సారమేకల సాంబశివరావు తదితర నేతలు పాల్గొన్నారు.

## ఎన్నడూ లేని అభివృద్ధిని సాధిస్తున్న మంగళగిరి

విశాలాంధ్ర-మంగళగిరి : స్థానిక మంగళగిరి టీడీపీ కార్యాలయం డాక్టర్ ఎంఎస్ఎస్ భవన్‌లో పట్టణ వార్డు కమిటీ సమావేశం పట్టణ పార్టీ అధ్యక్షులు పడవల మహేష్ అధ్యక్షతన మంగళవారం జరిగింది. గత ఏడాదిన్నరలో నియోజకవర్గంలో జరిగిన విస్తృత స్థాయి అభివృద్ధి, అమలవుతున్న సంక్షేమ పథకాలపై చర్చించారు. పార్టీ కార్యక్రమాలు, ప్రభుత్వ పథకాలను ప్రజల్లోకి మరింత బలంగా తీసుకెళ్లాలని మహేష్ పిలుపునిచ్చారు. మంత్రి, స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్ నేతృత్వంలో మంగళగిరి ఎన్నడూ లేని అభివృద్ధిని సాధిస్తోందని ఆయన పేర్కొన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర పద్మశాలి కార్పొరేషన్ చైర్మన్ నందం అబద్దయ్య, టీటీడీ బోర్డు సభ్యురాలు తమ్మిశెట్టి జానకిదేవి, పట్టణ పార్టీ ఉపాధ్యక్షులు వాసా పద్మ, పట్టణ పార్టీ ప్రధాన కార్యదర్శి షేక్ రియాజ్, రాష్ట్ర నాయీ బ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ మున్నంగి శివశేషగిరి రావు, రాష్ట్ర మైనారిటీ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ ఎండీ ఇబ్రహీం, రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ విన్నకోట శ్రీనివాసరావు, టీడీపీ రాష్ట్ర బీసీ సెల్ ముఖ్యకార్యదర్శి గుత్తికొండ ధనుంజయరావు తదితరులు పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కులు పంపిణీ

విశాలాంధ్ర-తాడేపల్లి : అనారోగ్యంతో బాధపడుతున్న వారికి వైద్యఖర్చుల కోసం సీఎం సహాయనిధి నుంచి మంజూరైన సీఎంఆర్ఎఫ్ చెక్కులను మంత్రి నారా లోకేష్ ఆదేశాలతో టీడీపీ తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మంగళవారం నలుగురికి పంపిణీ చేశారు. తాడేపల్లి పట్టణంలోని 8వ వార్డ్‌కి చెందిన జక్కుల ప్రమీల రూ.42,646 వేలు, 14వ వార్డ్‌కి చెందిన గజ్జలపూడి సదానందం రూ.30,121 వేలు, 15వ వార్డ్‌కి చెందిన గద్దం వెంకటేశ్వర్లు రూ.25,450 వేలు, షేక్ హసీనా రూ.20,541 వేలు ముఖ్యమంత్రి సహాయ నిధి చెక్కులను అందజేశారు. సీఎం సహాయనిధి చెక్కులు మంజూరు చేయించిన మంత్రి నారా లోకేష్‌కు బాధితులు కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా తాడేపల్లి పట్టణ అధ్యక్షులు వల్లభనేని వెంకట్రావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న వారికి ఆపన్న హస్తంలా ఆదుకుంటుందని అన్నారు. ఈ కార్యక్రమంలో తాడిబోయిన భాస్కర్, గుద్దంటి నాగేశ్వరరావు, కొర్రపాటి రమణ, బుదాల రవికుమార్, బెజ్జం బాబురావు, నరసింహారావు, బెజ్జం రామకృష్ణ, వల్లభాపురం పీటర్ పాల్, బెజ్జం కుమార్, అక్కల చెన్నయ్య, సువర్ణ రాజు, అశోక్, తాడిబోయిన గోపి, తురక దుర్గారావు, దారా నాని, ఎస్‌కే బాజీ, షేక్ అమీర్, షేక్ మస్తాన్ వలి, బి.శ్రీనివాస్ రెడ్డి, సింకా శ్రీనివాసరావు, భాగ్యలక్ష్మి, కళ్యాణి, మాలపాటి బాబూరావు, చిన్నం సంతోష్ కుమార్, మేకల శివశంకర్, కొర్రపాటి అశోక్, సైదులు, మొలక ఓబులేశ్వరరావు, గుడే రవి, కంచర్ల సుబ్బారావు, వీర్ల వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## ఈఓఆర్‌డీగా రహమాన్ బాధ్యతలు

విశాలాంధ్ర-తాడికొండ : తాడికొండ ఈఓఆర్‌డీగా షేక్ రహమాన్ మంగళవారం ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు ఆయన కంతేరు గ్రామ కార్యదర్శిగా పనిచేశారు. పదోన్నతి రావడంతో స్థానిక మండల పరిషత్ కార్యాలయ ఆవరణలో ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. గ్రామ సచివాలయాలను ప్రగతి పథంలో నడిపించేందుకు తన వంతు పూర్తి సహకారం అందిస్తానన్నారు. పలువురు కార్యదర్శులు రహమాన్‌ను అభినందించారు.

# క్లిష్ట పరిస్థితులను ధైర్యంగా ఎదుర్కోవాలి: డాక్టర్ రాజకుమారి

విశాలాంధ్ర-గుంటూరు వైద్యం : స్థానిక లక్ష్మీపురంలోని అభ్యుదయ మహిళా కళాశాల నందు 'మహిళా హింస వ్యతిరేక దినోత్సవం' కార్యక్రమాన్ని మంగళవారం నిర్వహించారు. ప్రముఖ గైనకాలజిస్ట్, ఐవీఎఫ్ స్పెషలిస్ట్, అహల్య ట్రస్ట్ డైరెక్టర్ డాక్టర్ శనక్కాయల రాజకుమారి ముఖ్య అతిథిగా హాజరైయ్యారు. ఈ సందర్భంగా ఆమె మహిళల భద్రతకు సంబంధించిన పలు కీలక అంశాలను విద్యార్థినీలకు వివరించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ మహిళలు ముఖ్యంగా డొమెస్టిక్ వైలెన్స్, సోషల్ మీడియా సైబర్ సెక్యూరిటీ, ఆన్‌లైన్ ఫ్రెండ్‌షిప్ వల్ల ఎదురయ్యే మోసాలు, డిజిటల్ అబ్యూస్ వంటి సమస్యలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థినీలకు సూచించారు. నేటి సమాజంలో మహిళలు అనేక సామాజిక, ఆర్థిక, రాజకీయ, విద్యాపరంగా అనేక సమస్యలు ఎదుర్కొంటున్నారని, గృహ హింసలు, మహిళలపై అత్యాచారాలు, లైంగిక వేధింపులు ఎక్కువైయ్యాయని ఆవేదన వ్యక్తంచేశారు. మహిళలు తమ జీవన గమనంలో క్లిష్ట పరిస్థితులు ఎదురైనా వాటిని ధైర్యంగా ఎదుర్కోవాలని అన్నారు. అనంతరం కళాశాల ప్రిన్సిపల్ రోహిణి సమాజంలో నేడున్న పరిస్థితుల్లో మహిళా భద్రతలపై ఎన్నో అవగాహన కార్యక్రమాలు అవసరమన్నారు. న్యాయవాది సరిత వర్బవల్ అబ్యూస్, ఉమెన్ అండ్ చైల్డ్ వెల్ఫేర్ విభాగం అందించే సేవలు..సమస్యలు వచ్చినపుడు సంబంధిత అధికారులను సంప్రదించే విధానం గురించి విద్యార్థినీలకు దిశానిర్దేశం చేశారు. ఈ కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ బీఎస్ఆర్‌కె ప్రసాద్, కళాశాల సిబ్బంది పాల్గొన్నారు.

## రౌడీ షీటర్‌పై మారణాయుధాలతో దాడి

విశాలాంధ్ర-పొన్నూరు : పట్టణంలోని మార్కెట్ సెంటర్‌లో మంగళవారం రౌడీషీటర్ సలీంపై ప్రత్యర్థులు మారణాయుధాలతో దాడి చేశారు. ఈ ఘటనలో తీవ్రంగా గాయపడిన సలీంను స్థానికులు, పోలీసులు ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. అర్బన్ సీఐ వీరనాయక్ కేసు నమోదు చేశారు. పాత కక్షలే కారణమని పోలీసులు ఆ కోణంలో విచారిస్తున్నారు. మార్కెట్ ప్రాంతంలో దాడులు పునరావృతం కాకుండా పోలీస్ పికెటింగ్ ఏర్పాటు చేశారు.

## డయాలసిస్ సెంటర్ ప్రారంభం

విశాలాంధ్ర-వినుకొండ: ఇటీవల వినుకొండ కారంపూడి రోడ్డులో ప్రారంభమైన సురేష్ సూపర్ స్పెషాలిటీ హాస్పిటల్‌ను ప్రభుత్వ చీఫ్ విప్, స్థానిక ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు మంగళవారం సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన్ను డాక్టర్ అన్న మణికంఠ సురేష్, డాక్టర్ మధుల దంపతులు ఘనంగా స్వాగతం పలికి సత్కరించారు. అనంతరం వైద్యశాలలో ఏర్పాటుచేసిన ఐసీయూ యూనిట్స్‌తో పాటు డయాలసిస్ సెంటర్, ల్యాబ్‌ను ప్రారంభించారు. అనంతరం జీవీ మాట్లాడుతూ మళ్లీ స్పెషాలిటీ వైద్యశాలను ఏర్పాటు చేయడంపై వైద్యులను ప్రత్యేకంగా అభినందించారు. వినుకొండలో మొట్టమొదటిసారిగా డయాలసిస్ సెంటర్ ఏర్పాటు చేయడం, దూర ప్రాంతాలకు వెళ్లాల్సిన పని లేకుండా అత్యాధునికమైన వైద్యం ఇక్కడే అందించడం హర్షనీయమన్నారు. జనరల్ సర్జరీ, లాప్రోస్కోపీ, లేజర్ అత్యాధునిక పరికరాలతోటి పెద్దపెద్ద సిటీలో అందించే వైద్య సేవలు డాక్టర్ మణికంఠ సురేష్ అందిస్తున్నారని వెల్లడించిన ఆయన ఇక డాక్టర్ మృదుల తేజస్వి సంతాన సాఫల్యం కొరకు ప్రత్యేక వైద్య సేవలు అందించనున్నారని, ఈ సేవలను నియోజకవర్గ ప్రజలతో పాటు పలనాడు, ప్రకాశం జిల్లాల ప్రజలు వినియోగించుకోవాలని కోరారు.

## సిమెంట్ రహదారులకు భూమిపూజ

విశాలాంధ్ర-దుర్గి: రూ.60 లక్షల వ్యయంతో దుర్గిలో 4 సిమెంట్ రహదారుల నిర్మాణాలకు ఈ నెల5న మాచర్ల శాసనసభ్యులు జూలకంటి బ్రహ్మానందరెడ్డి భూమిపూజ చేయనున్నట్లు పంచాయతీ రాజ్ మండల ఏఈ.పి హనుమంత రావు మంగళవారం తెలిపారు. దీనిలో భాగంగా దుర్గిలోని రూ.15 లక్షల జిల్లా మైనింగ్ నిధులతో నాగార్జున శిల్ప కళాశాల ప్రక్క బజారు, రూ.25 లక్షల జిల్లా మైనింగ్, ఉపాధి హామీ పథకం సంయుక్త నిధులతో పోలీసు స్టేషన్ ప్రక్కన జంగాలకాలనీ, రూ.10 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో యాదవుల బజారు, రూ.10 లక్షల ఉపాధి హామీ పథకం నిధులతో వెంకటేశ్వరస్వామి ఆలయం ప్రక్క బజారులో సీసీ రోడ్లకు శంకుస్థాపన చేసి, శిలాఫలకాలను ఎమ్మెల్యే ఆవిష్కరించనున్నట్లు ఏఈ తెలిపారు.

## రైతు ధాన్యానికి అండగా ప్రభుత్వం

విశాలాంధ్ర-కారంపూడి: రైతు సేవా కేంద్రం ఆధ్వర్యంలో రైతుల నుండి ధాన్యం కొనుగోలు కార్యక్రమాన్ని మంగళవారం చింతపల్లిలో ప్రారంభించారు. ముఖ్య అతిథిగా కూటమి పార్టీ రాష్ట్ర కార్యదర్శి, డీసీ కమిటీ4 చైర్మన్ పంగులూరి అంజయ్య హాజరై, ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతి గింజను ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని వెల్లడించారు. రైతులకు తక్షణ చెల్లింపులు అందేలా, మధ్యవర్తుల జోక్యం లేకుండా పూర్తిగా పారదర్శకంగా ధాన్యం కొనుగోలు జరుగుతుందన్నారు. రైతుల సమస్యలు వినడానికి, వెంటనే పరిష్కారాలు చూపడానికి ప్రత్యేకంగా మండల స్థాయిలో ప్రత్యేక బృందాలను ఏర్పాటు చేసినట్లు వివరించారు. రైతులు ధాన్యాన్ని కేంద్రాలకు అందించి, ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. కూటమి పార్టీ నాయకులు, వ్యవసాయ అధికారులు, గ్రామ ప్రజలు పాల్గొన్నారు.

## బాలోత్సవంలో ఆదర్శ పాఠశాల విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర-కారంపూడి: జిల్లా స్థాయి బాలోత్సవ-2025 పోటీల్లో కారంపూడి ఆదర్శపాఠశాల విద్యార్థులు తమ ప్రతిభను ప్రదర్శించి అత్యుత్తమ ఫలితాలను సాధించారని ప్రిన్సిపాల్ దాసుహాసిని మంగళవారం తెలిపారు. ఆమె మాట్లాడుతు సైన్స్ ఎక్స్‌పెరిమెంట్స్, లఘునాటిక, కోలాటం, కథారచన, వ్యాసరచన వంటి పలు విభాగాల్లో విద్యార్థులు ప్రతిభ వెలికి తీసి సర్టిఫికెట్లు, పతకాలు, ట్రోఫీలు గెలుచుకుని పాఠశాలకు గౌరవాన్ని తీసుకువచ్చారన్నారు. తమ విద్యార్థుల ప్రతిభే తమ బలమని, అన్ని విభాగాల్లోనూ హర్షణీయమైన ఫలితాలు సాధించడం ఎంతో గర్వకారణమన్నారు. విద్యార్థులను సిద్ధం చేసిన టీచర్స్ ప్రసన్నలక్ష్మి, నాగమల్లేశ్వరి, వ్యాయామ ఉపాధ్యాయులు ప్రత్యేకంగా పాల్గొని విద్యార్థులను ప్రోత్సహించినట్లు తెలిపారు.

## ఉపాధ్యాయులకు ఆటల పోటీలు

విశాలాంధ్ర-తాడేపల్లి : నిత్యం తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలు బోధిస్తూ, వారిని బావిభారత పౌరులుగా తీర్చిదిద్దుతున్న ఉపాధ్యాయులు మంగళవారం తాము సైతం అంటూ ఆటల పోటీలకు దిగారు. పెనుమాక వందేమాతరం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మహిళా ఉపాధ్యాయులకు త్రో బాల్ పోటీలు, పురుష ఉపాధ్యాయులకు క్రికెట్ పోటీలు నిర్వహించారు. ఈ ఆటల పోటీలను తెనాలి డివిజన్ ఇంచార్జ్ డిప్యూటీ డీఈఓ జి.శాంత కుమారి, ఎంఈఓ డి.నాగేశ్వరరావు, స్కూల్ ప్రధానోపాధ్యాయులు జి.అనంత శివ ప్రారంభించారు.

# ఘనంగా దివ్యాంగులకు ట్రైసైకిళ్ల పంపిణీ

విశాలాంధ్ర-వినుకొండ: ముఖ్యమంత్రి చంద్రబాబు 15 ఏళ్ల బంగారు పాలన, ప్రపంచ దివ్యాంగుల దినోత్సవం సందర్భంగా శివశక్తి లీలా అంజన్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు స్వగృహం ఆవరణలో దివ్యాంగులకు ట్రై సైకిళ్ల పంపిణీ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటు అయిన సభకు టీడీపీ పట్టణ అధ్యక్షులు బొంకూరి రోశయ్య అధ్యక్షత వహించారు. జీవీ మాట్లాడుతూ. వినుకొండ ప్రాంతంలో ఫ్లోరిన్ పీడిత కారణంగా అధికంగా దివ్యాంగులు ఉన్నారని, ఫ్లోరిన్ నివారించి స్వచ్ఛమైన తాగునీరు అందించేందుకు కృషి చేస్తున్నామన్నారు. శివశక్తి లీల అంజన్ ఫౌండేషన్ ద్వారా గత 30 ఏళ్లుగా పలు సేవా కార్యక్రమాలు చేస్తూ, ప్రజా జీవితంలో ముందుకు సాగుతున్నామన్నారు. చంద్రబాబు 15 ఏళ్ల ప్రతిపక్షంలో ఉన్నప్పటికీ ఎంతో హుందాగా వ్యవహరిస్తూ, ప్రజల కోసం కష్టపడ్డారన్నారు. తన సతీమణి శివశక్తి లీల అంజన్ ఫౌండేషన్ చైర్మన్ లీలావతిని ప్రత్యేకంగా అభినందించారు. నియోజకవర్గంలో దివ్యాంగులను ఆదుకుంటూ వారి పిల్లలకు స్కాలర్‌షిప్స్ అందజేస్తామని, దరఖాస్తులు చేసుకోవాలన్నారు. ముస్లిం మైనారిటీ ఆడపిల్లలకు స్కాలర్షిప్పులకు దరఖాస్తు చేసుకోవాలన్నారు. చంద్రబాబు హయాంలో హైదరాబాద్ ఎలా అభివృద్ధి చెందిందో, అదే రీతిలో ఏపీ కూడా అభివృద్ధి చెందబోతుందన్నారు. గత వైసీపీ అరాచక పాలనలో సాగునీటి ప్రాజెక్టులన్ని కుంటుపడ్డాయన్నారు. మరో ముఖ్య అతిథి రాష్ట్ర గ్రంథాలయ చైర్మన్ గోనుగుంట్ల కోటేశ్వరరావు మాట్లాడుతూ. ప్రజల కోసం నిత్యం శ్రమిస్తున్న జీవీ ఆంజనేయులు సేవలను కొనియాడారు. వినుకొండలో త్వరలో భూమి సేకరించి గ్రంథాలయ భవనం నిర్మించి పాఠకులకు అందుబాటులోకి తెస్తామన్నారు. జిడిసిసి బ్యాంకు జిల్లా చైర్మన్ మక్కెన మల్లికార్జునరావు మాట్లాడుతూ శివశక్తి లీల అంజన్ ఫౌండేషన్ గత 30 ఏళ్లుగా రాజకీయాలు, కుల మతాలకతీతంగా సేవా కార్యక్రమాలతో ముందుకు సాగుతూ నియోజకవర్గంలో మంచి గుర్తింపు పొందుతున్న కారణంగా, మళ్లీ మళ్లీ ఎమ్మెల్యేగా గెలుస్తూ ప్రభుత్వ చీఫ్ విప్ స్థాయికి ఎదిగి మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలతో ముందుకు సాగుతున్నారన్నారు. ఈ సందర్భంగా దివ్యాంగులకు 40 ట్రై సైకిళ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ డాక్టర్ దస్తగిరి షకీలా, కె.నాగ శ్రీను, గంగాధర్, బ్రహ్మయ్య, జానీ, హనుమా నాయక్, వెంకటరెడ్డి, అయినాల కోటేశ్వరరావు, బత్తుల వెంకటేశ్వర్లు, షమీం ఖాన్, గడిపూడి విశ్వనాథం, యార్లగడ్డ లెనిన్ కుమార్, రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్మెంట్ కార్పొరేషన్ చైర్మన్ పెమ్మసాని నాగేశ్వరరావు, రైల్వే బోర్డు సభ్యులు రాధ, శివశక్తి ఫౌండేషన్ మేనేజర్ రమేష్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ప్రజల వద్దకు 100 రోజులు కార్యక్రమాన్ని విజయవంతం చేయాలి: ఎమ్మెల్యే

విశాలాంధ్ర-అమరావతి: ప్రజల వద్దకు వంద రోజులు 100 గ్రామాల కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రజా ప్రతినిధులు ప్రజలు ఉన్నతాధికారులు బాధ్యతగా వ్యవహరించాలని శాసనసభ్యులు భాష్యం ప్రవీణ్ అన్నారు. మంగళవారం కర్లపూడిలో ప్రజాదర్బార్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రవీణ్ మాట్లాడుతూ గ్రామంలోనే మౌలిక సమస్యలు, డ్రైనేజీ త్రాగునీరు, రోడ్లు, లైట్లు, రెవెన్యూ ఆరోగ్యం, విద్య తదితర అంశాలపై ప్రజలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఉన్న వివిధ సమస్యలపై స్థానిక ప్రజలు ఇచ్చిన అర్జీలను ప్రవీణ్ స్వీకరించారు. ఈ కార్యక్రమంలో అమరావతి మండల తహశీల్దార్ ఎం దానియేలు, ఎంపీడీవో టి.పార్వతి, ప్రజలు నాయకులు పాల్గొన్నారు.

## 5న పేరెంట్స్ డే విజయవంతం చేయండి

విశాలాంధ్ర-పొన్నూరు : పొన్నూరు మండలంలోని అన్ని పాఠశాలల్లో ఈ నెల 5వ తేదీన రాష్ట్ర విద్యాశాఖ ఆదేశాల మేరకు మెగా పేరెంట్స్ డే కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు పొన్నూరు ఎంఈఓ-2 కె.విజయభాస్కర్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. కార్యక్రమంలో విద్యార్థుల తల్లిదండ్రులు తప్పనిసరిగా పాల్గొని తమ పిల్లల విద్యాభివృద్ధిని పరిశీలించుకోవాలని సూచించారు. పాఠశాలలో ల్యాబ్స్, త్రాగునీరు వసతి తదితర మౌలిక వసతులను పరిశీలించాలని కోరారు.

## స్వచ్ఛాంధ్ర-స్వర్ణాంధ్రపై అవగాహన

విశాలాంధ్ర-వినుకొండ: స్వచ్ఛఆంధ్ర-స్వర్ణాంధ్ర డిసెంబర్ నెల థీమ్ మరియు జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం సందర్భంగా పట్టణంలోని వెల్లటూరు రోడ్ నందు శర్మ స్కూల్‌లో విద్యార్థులకు కాలుష్య నియంత్రణ, పర్యావరణ పరిరక్షణ గురించి వ్యాసరచన, డ్రాయింగ్ పోటీలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సానిటరీ ఇన్స్పెక్టర్ ఇస్మాయిల్ మాట్లాడుతూ 1984 భోపాల్ గ్యాస్ విపత్తు జ్ఞాపకార్థంగా ప్రతి సంవత్సరం డిసెంబర్ 2వ తేదీన జాతీయ కాలుష్య నియంత్రణ దినోత్సవం జరుపుకుంటున్నామని, కాలుష్య నియంత్రణ మన బాధ్యత అని, కావున వారంలో ఒకరోజైనా ప్రజలు తమ రోజు వారి విధులకు కార్లు లేదా మోటర్ సైకిల్ వాడకుండా సైకిల్ వాడాలని తెలిపారు. చెట్లను నాటాలని కోరారు. స్వచ్ఛ ఆంధ్ర, స్వచ్ఛ వినుకొండను సాధించేందుకు తమ వంతుగా సింగిల్ యూజ్డ్ ప్లాస్టిక్ బదులు జూట్ మరియు క్లాత్ బ్యాగ్స్ వాడాలని, ఇంటి వద్ద తడి చెత్త, పొడి చెత్త వేరు చేసి ఇవ్వాలని విద్యార్థులకు తగు సూచనలు ఇచ్చారు. స్కూల్ ప్రిన్సిపాల్ శర్మ మాట్లాడుతూ ప్రస్తుతకాలంలో కాలుష్యం పెరగడానికి పరిశ్రమలు ప్రధాన కారణంగా ఉన్నాయన్నారు. అనంతరం శానిటరీ ఇన్స్పెక్టర్ చేతుల మీదుగా పోటీల్లో విజేతలుగా నిలిచిన వారికి బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సానిటరీ సెక్రటరీ రవి, శర్మ స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, మేస్త్రీలు పాల్గొన్నారు.

## కిల్కారి సేవలు-మాత శిశు సంరక్షణపై అవగాహన

విశాలాంధ్ర-పిడుగురాళ్ల : ఆర్.సి.హెచ్ పోర్టల్లో గర్భిణీల వివరాలు సకాలంలో ఖచ్చితంగా నమోదైన వారికి కిల్కారి కాల్స్ వస్తాయని డాక్టర్ ప్రభావతి తెలిపారు. పిడుగురాళ్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఆశా డే సమావేశం నిర్వహించారు. కిల్కారి ప్రోగ్రాం అధికారి రాజు మాట్లాడుతూ ప్రతి గర్భిణీ కిల్కారి కాల్స్ వచ్చినప్పుడు పూర్తిగా సమాచారాన్ని వినాలని, గర్భిణీలు బాలింతల సంఖ్య పెరగాలని దీనికోసం ఆశా కార్యకర్తలు, ఏఎన్ఎంలు క్రమం తప్పకుండా పర్యవేక్షించాలన్నారు. ఈ కిల్కారి కాల్ యొక్క ప్రాముఖ్యతను గర్భిణీ బాలింతలకు తెలియజేయాలన్నారు. కేంద్ర ప్రభుత్వం కిల్కారి కార్యక్రమాన్ని గర్భిణీ, బాలింతల కోసం ప్రవేశపెట్టబడిందని, ఈ కిల్కారి కాల్స్ గర్భిణీ 4వ నెల మొదలు బిడ్డ ఏడాది వరకు నెలకోసారి వాయిస్ కాల్స్ ద్వారా సమాచారం అందిస్తారని వివరించారు. దీని ద్వారా తల్లి బిడ్డల క్క ఆరోగ్య క్షేమ సమాచారాన్ని అందజేస్తుందని, ఈ సమాచారాన్ని గర్భిణీలు బాలింతలు క్రమం తప్పకుండా వినుట వలన ప్రతి గర్భిణీ బాలింత, చిన్న బిడ్డలు మంచి ఆరోగ్యం కలిగి ఉంటారని తెలిపారు. కిల్కారి కాల్ వచ్చే నెంబర్ 911 600403660 నెంబర్‌ని సేవ్ చేసుకోవాలని సూచించారు. డా.ప్రభావతి, పిహెచ్ఎన్ ఎన్.ధనలక్ష్మి, హెచ్.వి పద్మావతి, ఎంఎల్ హెచ్.పిలు, ఏఎన్ఎంలు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## కళాకారుడు రవి కుమార్‌కు జాతీయ పురస్కారం

విశాలాంధ్ర- అమరావతి: హైదరాబాద్ ఆర్.టీ.సి. సర్కిల్ పరిధి లోని నేషనల్ కల్చర్ సెంటర్ హాల్‌లో మోహిని ఈవెంట్స్ ట్రస్ట్, ఎల్.ఎస్.ఐ.ఎస్ ఫౌండేషన్స్ సంయుక్త ఆధ్వర్యంలో అభినందన సభ నిర్వహించారు. రాష్ట్ర స్థాయిలో అర్చక రంగస్థలం కళాకారులను జాతీయ పురస్కారాలు ప్రధానం చేసి సన్మానించారు. ఈ కార్యక్రమానికి ఫౌండేషన్ అధ్యక్షుడు కె.బుచ్చేశ్వరరావు అధ్యక్షత వహించారు. పల్నాడు జిల్లా సత్తెనపల్లి పట్టణానికి చెందిన వర్ధమాన రంగస్థల పౌరాణిక కళాకారుడు బెజగం రవి కుమార్ గత పదేళ్ల నుంచి విభిన్న, వైవిధ్య భరిత పౌరాణిక సాంఘిక మరియు చారిత్రక పాత్రలు ధరించి రెండు తెలుగు రాష్ట్రాల ప్రేక్షకులను మెప్పించినందుకు గాను జాతీయ పౌరాణిక నట కళారత్న జాతీయ పురస్కారం ప్రధానం చేసారు. ఈ సందర్భంగా అనేక బిరుదులందుకున్న బెజగం రవికుమార్‌ను ఏపీ ప్రజానాట్యమండలి పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి భైరవపట్నం రామకృష్ణ అభినందించారు. ప్రముఖ బుల్లి తెరనటి గంగా భవాని, నృత్యకారిణి షేక్ సిద్ధాభి, బుచ్చేశ్ సత్తెనపల్లి లోని వివిధ కళా సంస్థల వారు, మిత్రులు సహా కళ కారులు రవి కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు.

# మాదక ద్రవ్యాల నియంత్రణకు పటిష్ట చర్యలు : కలెక్టర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: జిల్లాలో మాదక ద్రవ్యాల నియంత్రణకు అవగాహన, ఎన్ఫోర్స్మెంట్ కార్యక్రమాలను సంబంధిత శాఖలు క్షేత్రస్థాయిలో పటిష్టంగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా ఆదేశించారు. మంగళవారం మాదక ద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశం కలెక్టర్ కార్యాలయంలో కలెక్టర్ అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా మాట్లాడుతూ మాదక ద్రవ్యాల వినియోగానికి ఆకర్షితులవుతున్న వారిని ప్రాథమిక దశలోనే గుర్తించేలా విద్యాసంస్థలు, వసతి గృహాల్లో అధికారులు నిరంతర పర్యవేక్షణ, అవగాహన కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. మాదక ద్రవ్యాలకు అలవాటు పడినవారు వ్యసనపరులుగా మారక ముందే వారికి అవసరమైన కౌన్సిలింగ్, సైకలాజికల్ సపోర్ట్, డి అడిక్షన్ సెంటర్లలో చికిత్స అందించేందుకు చర్యలు తీసుకోవాలని సూచించారు. మాదక ద్రవ్యాల వినియోగం వలన కలిగే నష్టాలపై ప్రజలకు ముఖ్యంగా విద్యార్థులు, యువతకు పూర్తిస్థాయిలో అవగాహన కలిగేలా విస్తృత స్థాయిలో సదస్సులు, ప్రచార కార్యక్రమాలను నిర్వహించాలన్నారు. జిల్లా పోలీసు సూపరింటెండెంట్ వకుల్ జిందాల్ మాట్లాడుతూ జిల్లాలో నవంబరు 1వ తేది నుంచి 28వ తేదీ వరకు 12 కేసులు నమోదు చేసి, 42 మందిని

అరెస్టు చేశామని, ఒక వాహనం సీజ్ చేశామన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి యువతకు అవగాహన కోసం సంకల్పమ్ కార్యక్రమం ద్వారా సదస్సులు, ప్రచార కార్యక్రమాలను నిర్వహిస్తున్నామన్నారు. మాదక ద్రవ్యాల వినియోగాన్ని అరికట్టడానికి పోలీస్ శాఖ రూపొందించిన ప్రచార పోస్టర్లను వారు ఆవిష్కరించారు. సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి ఖాజావలి, ఎక్సైజ్ సూపరింటెండెంట్ వి అరుణ కుమారి, అడిషనల్ ఎస్పీ రమణమూర్తి తదితర అధికారులు పాల్గొన్నారు.

**అవసరాలకు అనుగుణంగా ఇసుక సరఫరా**

జిల్లాలో ప్రజల అవసరాలకు అనుగుణంగా ఇసుక సరఫరా జరిగేలా మైనింగ్ శాఖ అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని జిల్లా కలెక్టర్ ఆదేశించారు. మంగళవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లాస్థాయి ఇసుక కమిటీ సమావేశం జరిగింది. వాహనాల సామర్థ్యం మేరకు అనుమతించిన టన్నుల వరకు మాత్రమే ఇసుకను సరఫరా చేసేలా వాహనాల యజమానులకు అధికారులు అవగాహన కల్పించాలని సూచించారు.

**మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా అప్ గ్రేడేషన్**

జిల్లాలోని 14 మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేస్తూ మంగళవారం జిల్లా కలెక్టర్ తమీమ్ అన్సారియా అధ్యక్షతన కలెక్టర్ కార్యాలయంలో జరిగిన జిల్లా సెలక్షన్ కమిటీ సమావేశంలో ఆమోదించారు. జిల్లాలో మినీ అంగన్వాడి కేంద్రాలను మెయిన్ అంగన్వాడి కేంద్రాలుగా అప్ గ్రేడ్ చేయుటకు అనుమతి ఇస్తూ ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. ఐసిడిఎస్ పిడీ ప్రసూన, డిఇఓ రేణుక, డిఎంహెచ్ఓ డా.విజయలక్ష్మి, సిడిపివోలు పాల్గొన్నారు.

## రోడ్డు నిర్మాణ పనుల పరిశీలన

విశాలాంధ్ర-అమరావతి: శరవేగంగా జరుగుతున్న అమరావతి - బెల్లం కొండ రోడ్డు పనులను స్థానిక శాసనసభ్యులు బాష్యం ప్రవీణ్ మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు నిర్మాణ పనులను సాధ్యమైనంత త్వరగా పూర్తి చేయడంతో పాటు నాణ్యత లోపం చకుండా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. గత ప్రభుత్వంలో నిర్లక్ష్యానికి గురైన రోడ్డును కూటమి ప్రభుత్వం నిధులను మంజూరు చేసి రోడ్డును పూర్తి చేస్తుందని ఎమ్మెల్యే అన్నారు. నాయకులు, అధికారులు పాల్గొన్నారు.

## పరీక్ష నిర్వహణ తీరు పరిశీలన

విశాలాంధ్ర-చిలకలూరిపేట: ప్రాథమిక పాఠశాల స్థాయిలో విద్యార్థులకు 1వ తరగతి నుండి 5వ తరగతి వరకు ఫౌండేషన్ లిటరసీ న్యూమరసి సామర్థ్యాలను తెలుగు, ఇంగ్లీష్, గణితం వారీగా అసెస్ పరీక్ష విధానం నిర్వహిస్తారు. ఇందులో భాగంగా మంగళవారం పట్టణంలోని మున్సిపల్ ప్రాథమిక పాఠశాల పోలిరెడ్డి పాలెంలో విద్యార్థులకు నిర్వహిస్తున్న పరీక్షలను బోయపాలెం డైట్ సీనియర్ లెక్చరర్ పోలేరు పరిశీలించారు. పాఠశాలలో నమోదైన 126 మంది విద్యార్థులకు మూడు రోజులపాటు నిర్వహించిన ఈ పరీక్ష మంగళవారంతో ముగిసింది. పరీక్ష మూల్యాంకనం అనంతరం విద్యార్థుల స్థాయిలను నిర్ధారించి గ్రేడ్ ఇస్తారని పాఠశాల ఉపాధ్యాయుడు పోటు శ్రీనివాసరావు వివరించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులు జై హైమావతి, ఉపాధ్యాయులు పి శైలజ, జి ఆదిలక్ష్మి, కె అరుణ, సిహెచ్ నవ్య శ్రీ పాల్గొన్నారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కు పంపిణీ

విశాలాంధ్ర-మంగళగిరి : మండలంలోని పెద్దవడ్లపూడి గ్రామంలో మంత్రి నారా లోకేష్ చొరవతో ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కును టీడీపీ నాయకులు అందజేశారు. పెద్దవడ్లపూడి గ్రామానికి చెందిన దాసరి ఫణి సుమంత్ కార్తీక్ చైతన్యకు రూ.43 వేల చెక్కును, టీడీపీ నాయకులు అందజేశారు. సహాయనిది చెక్కు అందుకున్న లబ్ధిదారులు మంత్రి, స్థానిక శాసనసభ్యులు నారా లోకేష్‌కి ధన్యవాదాలు తెలియజేశారు. చెక్కులు అందజేసిన వారిలో మంగళగిరి మార్కెట్ యార్డ్ ఛైర్మన్ జవ్వాది కిరణ్ చంద్, సీనియర్ నాయకులు మాదల రమేష్ బాబు, మీనిగల వెంకటేష్, మొద్దుకూరి రమేష్ బాబు, షేక్ బాజీ(నేపాల్), కంచర్ల బుల్లబ్బాయ్, గోపి పాల్గొన్నారు.

## వారధి ఫౌండేషన్ తోడ్పాటుతో పాఠశాల అభివృద్ధి

విశాలాంధ్ర-దాచేపల్లి: వారధి ఫౌండేషన్ అధ్యక్షుడు తగరం ఆనంద్ కుమార్ మాదినపాడు రోడ్డులోని ఎస్సీ కాలనీలో ఉన్న ప్రాథమిక పాఠశాలకు ఉపాధ్యాయుడుగా రావడం ఆ పాఠశాలకు వరంగా మారింది. ఆయన ఆధ్వర్యంలో నడుస్తున్న ఈ ఫౌండేషన్‌తో పాటు సభ్యుల సహకారంతో ఆ పాఠశాలలో ఎన్నో అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. విద్యార్థుల హితానికి కూడా పలు సంక్షేమ కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. దీనిలో భాగంగానే తాజాగా ఫౌండేషన్ సభ్యుడు గెల్లి సంతోష్, దివ్య దంపతుల కుమారుడు గీతాన్ష్ శ్రీరామ్ పుట్టిన రోజు సందర్భంగా విద్యార్థులకు ఉపయోగపడే విధంగాను, క్రీడల్లో నైపుణ్యం పెంపొందించుకోవడం కోసం మూడు క్యారం బోర్డులు పాఠశాలకు ఇచ్చారు. అదేవిధంగా విద్యార్థులతో పాటు ఉపాధ్యాయ బృందానికి భోజనాలు ఏర్పాటు చేశారు. ఇంకా పాఠశాల అభివృద్ధికి తమ వంతు తోడ్పాటు అందిస్తామని భారోసా ఇచ్చారు. ఈ విధంగా పాఠశాల అభివృద్ధికి ఎంతగానో దోహదపడుతున్న దాతలతో పాటు సభ్యులకు ప్రధానోపాధ్యాయుడు కాకుమాను మోజెస్, తగరం ఆనంద్ కుమార్‌తో పాటు మిగతా ఉపాధ్యాయులు కృతజ్ఞతలు తెలిపారు.

## మురుగు కాలువలో పసికందు మృతదేహం

విశాలాంధ్ర - కారంపూడి: స్థానిక ఎస్సీ కాలనీలో జరిగిన ఘటన స్థానికులను విషాదంలో ముంచెత్తింది. మురికి కాలువలో రోజుల పసికందు శవం కనిపించడం కలకలం రేపింది. మంగళవారం ఉదయం కాలువ పక్కనకు వెళ్లిన స్థానికులు పసికందు కనిపించడంతో ఒక్కసారిగా దిగ్భ్రాంతికి గురయ్యారు. తక్షణమే వారు కాలువలో నుంచి పసికందును బయటకు తీసినా అప్పటికే ఆ చిన్నారి మృతి చెందినట్లు గుర్తించారు. మానవత్వం మచ్చుకు కూడా లేనట్లుగా ఈ ఘటన చోటుచేసుకోవడం పట్ల ప్రజలు తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఘటనపై స్థానికులు తీవ్రంగా స్పందించి ఆ పాపాయిని సంప్రదాయ పద్ధతిలో పూడ్చిపెట్టారు. పసికందును కాలువలో పడవేయడానికి గల కారణాలపై అసలు నిజాలు బయటపడేందుకు పోలీసుల విచారణ అవసరమని ప్రజలు అభిప్రాయ పడుతున్నారు.

## అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా గొట్టిపాటి

విశాలాంధ్ర - దాచేపల్లి : అంబేడ్కర్ ఇండియా మిషన్ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలిగా గొట్టిపాటి రమణకుమారి నియమితులయ్యారు. ఈ మేరకు మిషన్ వర్కింగ్ ప్రెసిడెంట్ హరికృష్ణ ఆమెను నియమించినట్లు పల్నాడు జిల్లా అధ్యక్షుడు కొండవీటి కొండలరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆమె నియామకం పట్ల హర్షం వ్యక్తం చేశారు.

## పీఎం ఆవాస్ ఎన్టీఆర్ పథకం గడువు పొడిగింపు

విశాలాంధ్ర-కారంపూడి: గ్రామీణ పీఎం ఆవాస్ యోజన, ఎన్టీఆర్ గృహ నిర్మాణ పథకం దరఖాస్తుల గడువును ప్రభుత్వం డిసెంబర్ 14 వరకు పొడిగించినట్లు కారంపూడి హౌసింగ్ ఏఈ బాబురావు తెలిపారు. మంగళవారం కార్యాలయంలో మాట్లాడుతూ, ఇల్లు నిర్మించుకోవాలనుకునే అర్హులైన పేద కుటుంబాలు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని ఆయన సూచించారు. దరఖాస్తు చేసుకునేందుకు మండల కార్యాలయం లేదా గ్రామ/వార్డు సచివాలయాల్లో సంబంధిత అధికారులను సంప్రదించాలని బాబురావు సూచించారు. సొంత ఇల్లు లేని పేద కుటుంబాల కోసం కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకం ద్వారా ఆర్థిక సహాయం అందిస్తున్నాయని ఆయన తెలిపారు. పథకం సద్వినియోగం చేసుకొని మండలంలోని అర్హులైన ప్రతి కుటుంబం దరఖాస్తు చేసుకోవాలని ఏఈ బాబురావు విజ్ఞప్తి చేశారు.

## కళాశాల విద్యార్థి ఆత్మహత్య

విశాలాంధ్ర-తాడేపల్లి : తాడేపల్లిలోని ఓ కళాశాల విద్యార్థి హాస్టల్లో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడు బాపట్ల జిల్లా పోతిని కొత్తపాలెంకు చెందిన సురేష్ రెడ్డి(20)గా పోలీసులు తెలిపారు. ఓ హాస్టల్‌లో ఉంటూ ప్రైవేట్ కాలేజీలో బీటెక్ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. మృతదేహాన్ని తాడేపల్లిలోని ఓ ప్రైవేట్ హాస్పటల్ మార్చురీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.


**పాస్‌పోర్ట్ పోయినది**

గుంటూరు సిటి, బొంగరాలబీడు, 4వ లైను, డోరు నెం.7-6-41రు కాపురస్తులు గంగోలు జేమ్స్ గారి కుమారుడు గంగోలు అఖిల్ రాజు (సెల్: 8466950784) అను నేను తెలియజేయునది- నా పేరిట గల పాస్‌పోర్ట్ నెం. **B9877713** ఒరిజినల్‌ను ది.25-11-2025న నా ఇంటి వద్ద నుండి అరండల్‌పేట ఏరియాకు జిరాక్సు కోసం టూవీలర్‌పై వెళ్ళుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినది. ఎవరికైనా దొరికిన యెడల పై చిరునామాలో తెలియజేయగలరు.

**CHANGE OF SURNAME**

I, **TUMMURU MADHAVI** (Old Name), W/o. **THUMMURU LAKSHMI NARAYANA REDDY**, Resident of Door No.3-14-4/1, Chakali Cheruvu, Rajaka Pet, Tenali, Guntur District, Andhra Pradesh - 522201. I have changed my surname as **THUMMURU MADHAVI** (New Name) W/o. **THUMMURU LAKSHMI NARAYANA REDDY**. Hereafter my surname is known as **THUMMURU MADHAVI** (New Name) W/o. **THUMMURU LAKSHMI NARAYANA REDDY.**

**CHANGE OF SURNAME**

I, **TUMMURU LAKSHMI NARAYANA REDDY** (Old Name), S/o. **THUMMURU RAMA KRISHNA REDDY**, Resident of Door No.9-43/5, Kummari Bazaru, Gorantla, Guntur, Guntur District, Andhra Pradesh - 522034. I have changed my surname as **THUMMURU LAKSHMI NARAYANA REDDY** (New Name) S/o. **THUMMURU RAMA KRISHNA REDDY**. Hereafter my surname is known as **THUMMURU LAKSHMI NARAYANA REDDY** (New Name) S/o. **THUMMURU RAMA KRISHNA REDDY.**

**బహిరంగ ప్రకటన**

నా క్లయింటు అయిన గుంటూరుసిటీ, కొత్తపేట బుచ్చయ్య తోట 2వ లైను, డోర్.నెం.8-3-45 కాపురస్తులు లింగాల రామస్వామి గారి కుమారుడు లింగాల రామ మురళి గారి సూచనల మేరకు యావన్మందికీ తెలియజేయునది ఏమనగా, దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి లింగాల రామ మోహన్ @ రామ మోహన్ రావు గారికి 2000 సంగజూన్ నెలలో ప్రభుత్వం వారు బి-ఫారం పట్టా ఇవ్వబడినది ఆ తదుపరి సదరు ఆస్తిని అభివృద్ధి పరచుకొని ఆర్.సి.సి. ఇంటిని నిర్మించుకొని సర్వ హక్కులతో అనుభవించుచున్నారు. అట్టి ఆస్తికి ది.14-08-2025న ఒక అన్ రిజిస్టర్డ్ వీలునామాను వ్రాయించి సదరు వీలునామాలో రామ మోహన్ @ రామ మోహన్ రావు గారు తన మరణానంతరం దిగువ షెడ్యూలు ఆస్తిపై వచ్చే అయివేజును తన భార్య జీవించి యున్నంత వరకు అనుభవించవలగా, ఆమె మరణానంతరం ఆయన నాల్గవ తమ్ముడైన లింగాల రామ మురళి స్వాధీన పరచుకొని దాన దమన వినిమయ, విక్రయాది సంపూర్ణ సర్వ హక్కులతో అనుభవించు లాగున సదరు వీలునామాను వ్రాయడం జరిగినది. ప్రస్తుతం లింగాల రామమోహన్‌రావు గారు ది. 07-09-2025 మరణించి నందున దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తి వీలునామా లోని అంశముల ప్రకారం ఆయన భార్య సాంబ్రాజ్యం మరియు ఆయన నాల్గవ తమ్ముడైన లింగాల రామ మురళి గారికి సంక్రమించినదని యావన్మందికి తెలియజేయడమైనది.

**షెడ్యూలు :** గుంటూరు జిల్లా, గుంటూరు సిటీ, గుంటూరు మునిసిపల్ కార్పొరేషన్, శారదా కాలని, 7వ లైను, ప్లాట్ నెం. 154, డోర్. నెం. 34-06-367/2 లోని నివేశన స్థలము బి-ఫారం పట్టా రీత్యా నాకు దాన విక్రయాది సంపూర్ణ హక్కు భుక్తములు కలిగిన స్థలముకు **హద్దులు:తూర్పు:** భువనేశ్వర రావు గారి ఇంటి హద్దు,**దక్షిణం:**మణికంఠరావు గారి ఇంటి హద్దు,**పడమర:**అ.10లు గుల రోడ్డు, **ఉత్తరం:**అ.15లు గుల రోడ్డు.ఈ హద్దుల మధ్య చ.గ.100 నివేశన స్థలము అందలి ఆర్.సి.సి డాబా అందలి యావద్విశిష్టములతో సహా.

**నామాల శ్రీనివాసరావు**
**అడ్వకేట్, గుంటూరు. సెల్ : 7032136147**

**బహిరంగ ప్రకటన**

నా క్లయింటు గుంటూరు సిటి, ఏటుకూరు రోడ్డు, సంగడిగుంట, డోరు నెం. 19-8-17రు కాపురస్తులు కజ్జం సుబ్బారావు గారి కుమారుడు **కజ్జం వేణుగోపాలరావు** గారి సంజాయిషీ పొంది యావన్మందికి తెలియజేయునది ఏమనగా- నా క్లయింటు పేరిట గుంటూరు సిటి,ఏటుకూరు రోడ్డు, సంగడిగుంట టి.యస్ నెం.358, 359, 360, 361/ఏ, 361/సి మరియు 362 నందు 82 చదరపు గజముల ఆస్తి కలదు. సదరాస్తిలో చ.గ.19.9లు ఆస్తి విక్రయ దస్తావేజు నెం.2512/1995 ద్వారా, చ.గ.26లు విక్రయ దస్తావేజు నెం. 3581/1998 ద్వారా చ.గ.41లు విక్రయ దస్తావేజు నెం. 2327/2003 (గుంటూరు ఎస్ఆర్ఓ) ద్వారా సంక్రమించినవి. ఈ మూడు దస్తావేజులు మరియు లింకు దస్తావేజులు అయిన ద.నెం.3584/1998, ద.నెం.3580/1998 మొత్తం 5 ఒరిజినల్ దస్తావేజులను ఒక కవరులో పెట్టుకుని ది.17-11-2025న గోరంట్ల సెంటర్‌లోని తన బంధువుల ఇంటి నుండి గుంటూరు ఆర్టీసీ ఆఫీసు వద్దకు వెళ్ళుచుండగా మార్గమధ్యలో ఎక్కడో పడిపోయినవి. సదరు దస్తావేజులు ఎవరికైనా దొరికిన యెడల నా క్లయింటుకు అందజేసి తగిన పారితోషికము పొందగలరు. అలాగే సదరాస్తి విషయమై ఎవరికైనా అభ్యంతరములు, ఆక్షేపణలు ఉన్న యెడల నాకు గానీ, నా క్లయింటుకు గానీ 15 రోజులలోగా తెలియజేయగలరు.

**ఇట్లు: పిల్లి పోతురాజు**, అడ్వకేట్ & నోటరి, చిరునామా: డోరు నెం.7-17-259, 1వ లైను శ్రీనగర్, గుంటూరు,సెల్: 99499 29383

**CHANGE OF SPOUSE NAME**

I, **RAVELA SIVA SATYANARAYANA S/o Venkateswarlu**, R/o Door No. 11-400, Near G.R. School, Old Mangalagiri, Mangalagiri Municipal, Guntur Dist., A.P. 522503, do hereby solemnly affirm that my wife's name has been wrongly recorded as **RAVELA VUJAYA LAKSHMI** (Old Name).I have changed her name as **RAVELA VIJAYA LAKSHMI (New Name) W/o Ravela Siva Satyanarayana.**Hereafter her name shall be known as RAVELA VIJAYA LAKSHMI (New Name) W/o Ravela Siva Satyanarayana.

## రేపటి సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశాన్ని జయప్రదం చేయండి

విశాలాంధ్ర-చిలకలూరిపేట: సీపీఐ శతాబ్ది ఉత్సవాల సందర్భంగా వాడవాడల దేశమంతా జండా ఆవిష్కరణలు సభలు సమావేశాలు నిర్వహించుకుంటున్నామని, దానిలో భాగంగానే పల్నాడు జిల్లాలో కూడా దాచేపల్లిలో సీపీఐ జిల్లా జనరల్ బాడీ సమావేశం నిర్వహించుకోవడం జరుగుతున్నదని ఆ పార్టీ ఏరియా కార్యదర్శి తాళ్లూరి బాబురావు తెలిపారు. సీపీఐ కార్యాలయంలో మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ భూమికోసం, భుక్తి కోసం, విముక్తి కోసం పోరాడిన సీపీఐ నూరు సంవత్సరాలు పూర్తి చేసుకున్న సందర్భంగా డిసెంబర్ 26న శతాబ్ది ఉత్సవాలను వాడవాడల దేశమంతటా నిర్వహించుకోబోతున్నట్లు ఆయన తెలిపారు. అధికారం లేకపోయినా వంద సంవత్సరాల పాటు పేదల గొంతుకై, పేదల పక్షాన పోరాడి అనేక విజయాలను సాధించిందని అన్నారు. ఈ సందర్భంగా పార్టీ క్యాడర్ సమయత్తమై సమావేశాన్ని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సీపీఐ పట్టణ కార్యదర్శి చెరుకుపల్లి నిర్మల, ఏఐవైఎఫ్ పల్నాడు జిల్లా కార్యదర్శి షేక్ సుభానీ, వేలూరు గ్రామ సీపీఐ కార్యదర్శి ఏలికా శ్రీనివాసరావు, నాయకులు నానా, చంద్ర కొండలరావు, బొగ్గరపు బ్రహ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

పెదకూరపాడు: ఈనెల 4న దాచేపల్లి నారాయణపురం మండపాటి నాగిరెడ్డి కమ్యూనిటీ హాల్లో ఉదయం 10 గంటలకు జిల్లా సీపీఐ కార్యవర్గం మధ్యాహ్నం 3 గంటలకు జిల్లా సమితి సమావేశం జరుగుతుందని, ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని పెదకూరపాడు నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మునగోటి శ్రీనివాసరావు కోరారు. ఆయన మాట్లాడుతూ ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య, జిల్లా ఇన్చార్జి రాష్ట్ర కార్య దర్శ వర్గ సభ్యులు అక్కినేని వనజ, సిపిఐ జిల్లా కార్యదర్శి ఏ మారుతి వరప్రసాద్, సహాయ కార్యదర్శి షేక్ హుస్సేన్, కాసా రాంబాబు తదితరులు హాజరవుతున్నారని అన్నారు. పెదకూరపాడు నియోజవర్గ సిపిఐ సభ్యులు జిల్లా సమితి సభ్యులు హాజరై సమావేశం జయప్రదం చేయాలన్నారు.

మాచర్ల : ఈ నెల 4న దాచేపల్లి లోని నారాయణపురం సీపీఐ కళ్యాణ మండపంలో జరగనున్న జనరల్ బాడీ సమావేశాన్ని విజయవంతం చేయాలని ఆ పార్టీ మాచర్ల ఏరియా సెక్రెటరీ మేకపోతుల శ్రీనివాసరెడ్డి తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ సమావేశంలో సీపీఐ ఆవిర్భవించి ఈ నెల 26కు నూరేళ్లు పూర్తవుతున్న సందర్భంగా చలో ఖమ్మం, సభ్యత్వాలు, భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలపై చర్చిస్తారన్నారు. సమావేశానికి మాచర్ల, గురజాల నియోజకవర్గాల నుంచి సీపీఐ నాయకులు కార్యకర్తలు కార్మికులు అభిమానులు భారీగా తరలిరావాలని ఆయన కోరారు.

## టిడ్కో గృహ లబ్ధిదారులకు రుణ సదుపాయం

విశాలాంధ్ర-చిలకలూరిపేట: వైసీపీ ప్రభుత్వం టిడ్కో గృహాల్ని నిరుపయోగంగా మార్చి లబ్ధిదారులకు తీవ్ర అన్యాయం చేసిందని, రంగుల పిచ్చితో పేదల సొంతింటి కలను నీరుగార్చారని మాజీమంత్రి, శాసనసభ్యులు ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. మంగళవారం ఆయన పట్టణంలోని టిడ్కో గృహాల నిర్మాణం.. కేటాయింపు.. లబ్ధిదారులకు రుణ మంజూరు తదితర అంశాలపై సంబంధిత అధికారులు, బ్యాంకర్లు, ప్రైవేట్ ఫైనాన్స్ సంస్థల ప్రతినిధులతో మున్సిపల్ కార్యాలయంలో సమీక్ష సమావేశం నిర్వహించి, మీడియాతో మాట్లాడారు. ఇళ్లు పొందిన లబ్ధిదారులకు జాతీయ బ్యాంకులు ఇప్పటికీ వివిధ కారణాలతో రుణాలు మంజూరు చేయలేదని, వారికి రుణాలు అందించేందుకు కొన్ని హౌసింగ్ ఫైనాన్స్ సంస్థలు ఆసక్తిగా ఉన్నాయని ప్రత్తిపాటి చెప్పారు. ఈజీ హౌసింగ్ ఫైనాన్స్, ఐ.ఐ.ఎఫ్.ఎల్ ఫైనాన్స్ సంస్థలు టిడ్కో లబ్ధిదారులకు రుణాలివ్వడానికి ముందుకొచ్చాయన్నారు. ఇళ్లను సద్వినియోగం చేసుకునేవారికి నిబంధనలు సడలించి లబ్ధిదారులకు న్యాయం చేస్తామని సదరు సంస్థల ప్రతినిధులు చెప్పారని ప్రత్తిపాటి తెలిపారు. జనసేన ఇంచార్జి తోట రాజారమేష్, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ టీడీపీ కరీముల్లా, మున్సిపల్ చైర్మన్ షేక్ రఫాని, మెప్మా పీడీ, బ్యాంకు అధికారులు, నాయకులు పాల్గొన్నారు.

# చలో విజయవాడ.. జయప్రదం చేయండి

విశాలాంధ్ర-పెదకాకాని : విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రం నుంచి ధర్నా చౌక్ వరకు బుధవారం జరిగే అగ్రిగోల్డ్ బాధితుల 'ఆవేదన యాత్ర', ధర్నా చౌక్‌లో జరిగే 'ఆవేదన దీక్షలలో' అగ్రిగోల్డ్ బాధితులు పెద్ద సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని అసోసియేషన్ నాయకులు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్ వెల్ఫేర్ అసోసియేషన్ గుంటూరు జిల్లా ప్రధాన కార్యదర్శి కేతినేని అగస్టీన్ మాట్లాడుతూ గత 11 సంవత్సరాల నుంచి అసోసియేషన్ ఆధ్వర్యంలో అగ్రిగోల్డ్ అసోసియేషన్ రాష్ట్ర గౌరవ అధ్యక్షులు ముప్పాళ్ళ నాగేశ్వరరావు సారథ్యంలో అనేక శాంతియుత పోరాటాలు జరపడం వలన మరణించిన 142 మంది బాధిత కుటుంబాలకు రూ.5 లక్షలు చొప్పున గత టీడీపీ ప్రభుత్వం హయాంలో చంద్రబాబు నాయుడు ఎక్స్‌గ్రేషియా చెల్లించారన్నారు. రూ.250 కోట్లు కార్పస్ ఫండ్‌గా ఇచ్చారని, రూ.10 వేలు, రూ.20 వేలు లోపు వారికి జగన్ మోహన్ రెడ్డి బటన్ నొక్కి రూ.906 కోట్లు బాధితులకు ఇచ్చి మిగిలిన వారికి మొండి చేయి చూపించారని ఆవేదన వ్యక్తం చేశారు. చివరి బాధితునికి చివరి పైసా వచ్చేవరకు అండగా సీపీఐ ఉంటుందని, కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో పెట్టిన విధంగా బాధితులకు అగ్రిగోల్డ్ ఆస్తులు అమ్మి వెంటనే న్యాయం చేసి, ఇచ్చిన హామీలు నిలబెట్టుకోని పక్షంలో రాష్ట్రవ్యాప్తంగా ఉద్యమాలను మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సీపీఐ పొన్నూరు నియోజకవర్గ కార్యదర్శి పి.సత్యనారాయణ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల మేనిఫెస్టోలో చెప్పిన విధంగా అగ్రిగోల్డ్ ఆస్తులు వెంటనే అమ్మి బాధితులకు సత్వర న్యాయం చేయాలని, అగ్రిగోల్డ్ కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక ఫాస్ట్ ట్రాక్ కోర్టును విజయవాడ కేంద్రంగా ఏర్పాటు చేయాలని, సమర్థత, నమ్మకం కలిగిన ఉత్తమ అధికారుల బృందంతో ప్రత్యేక సిట్‌ను ఏర్పాటు చేయాలని, కాల పరిమితి విధించాలని, సమస్య పరిష్కారం అయ్యేవరకు ట్రాన్స్‌ఫర్స్ లేకుండా తగినంత మంది అధికారులను సీఐడీకి కేటాయించాలని, కంపెనీ ఆస్తుల మ్యుటేషన్ను తగినంత వేగంగా పూర్తి చేసి, ఆస్తులు అమ్మకాన్ని వేగవంతం చేయాలని, కోర్టు పర్యవేక్షణలో ప్రముఖ కంపెనీల ద్వారా ఆక్షన్ నిర్వహించాలని, 2015 ముందు రిజిస్టర్ చేయించుకున్న ఇళ్ల స్థలాలను, అపార్ట్మెంట్ ఫ్లాట్లను అటాచ్‌మెంట్‌ల నుంచి తొలగించి ఆయా యజమానులకు అందించాలని, కంపెనీ యాజ మాన్యం వారి కుటుంబ సభ్యుల పేర్లతో దాచిన బినామీ ఆస్తులన్నిటిని స్వాధీనం చేసుకుని వెంటనే అబ్సల్యూట్ చేయించాలని, ఈ కాలంలో మరణం చిన అర్హత కలిగిన బాధిత కుటుంబాలకు ఎక్స్‌గ్రేషి యా ఇప్పించాలని, మరొక బాధితుని మరణం జర క్కుండా చూడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సొలస వెంకటేశ్వరరావు, రామిశెట్టి శ్రీనివాసరావు, షేక్ గాలి సాహెబ్, షేక్ సలీం, వీర్ల శ్రీను తదితరులు పాల్గొన్నారు.

# అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్ర జయప్రదం చేయాలి

విశాలాంధ్ర-తెనాలి : బుధవారం విజయవాడలో జరుగు అగ్రిగోల్డ్ బాధితుల ఆవేదన యాత్ర నేడు జయప్రదం చేయాలని అగ్రిగోల్డ్ కస్టమర్స్ అండ్ ఏజెంట్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు షేక్ బషీర్ పిలుపునిచ్చారు. తెనాలి గాంధీనగర్ సీపీఐ కార్యాలయంలో మంగళవారం జరిగిన అసోసియేషన్ విస్తృత సమావేశంలో ఆయన మాట్లాడారు. పది సంవత్సరాలుగా వేలాది డిపాజిటర్లు ఆర్థిక మానసిక ఆరోగ్య పరమైన కష్టాల్లో వున్నారన్నారు. ఎన్నికల ముందు బాధితులకు న్యాయం చేస్తామని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్, ఐటీ మంత్రి నారా లోకేష్‌లు ఇచ్చిన హామీలు అమలు చేయలేదన్నారు. బాధితులపై ప్రభుత్వం నిర్లక్ష వైఖరి చూపుతుందన్నారు. కంపెనీకి ఆస్తులు ఉన్నప్పటికి డిపాజిటర్లకు చెల్లింపులు జరపకపోవడం వ్యవస్థ వైఫల్యం స్పష్టంగా కనబడుతుందన్నారు. సభ్యులందరూ ఈ కార్యక్రమంలో పాల్గొనాలన్నారు. డిసెంబర్ 3వ తేదీ ఉదయం 10గంటలకు విజయవాడ కళాక్షేత్రం వద్దనున్న ధర్నాచౌక్ వద్దకు అందరూ హాజరు కావాలని కోరారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరావు, లోకం శ్రీనివాసరావు, ఎస్.ఎ.రఫీ, కె.సుధాకర్, సూర్యనారాయణ, నరసింహారావు, సిపిఐ నాయకులు బొల్లిముంత కృష్ణ, మిరియాల రాఘవయ్య తదితరులు పాల్గొన్నారు.

### మెగా పేరెంట్స్ టీచర్స్ సమావేశాలు
## పండుగలా నిర్వహించాలి: కలెక్టర్

విశాలాంధ్ర-నరసరావుపేట: మెగా పేరెంట్స్ టీచర్స్ మీటింగ్‌లను విద్యాశాఖ అధికారులు పండుగ వాతావరణంలో నిర్వహించాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా తెలిపారు. మెగా పీటీఎంపై విద్యాశాఖ జిల్లా, డివిజన్, మండల స్థాయి అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుంచి వీక్షణ సమావేశం నిర్వహించారు. ప్రభుత్వ పాఠశాలలు, రెసిడెన్షియల్ పాఠశాలలు, ఆశ్రమ పాఠశాలలు, జూనియర్ కళాశాలలో ఈనెల 5వ తేదీన మెగా పీటీఎం నిర్వహించాలని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉన్న ప్రభుత్వ పాఠశాలల్లో ఈ కార్యక్రమాలను ప్రభుత్వ నిబంధనలను అనుసరిస్తూ నిర్వహించాలన్నారు. ప్రతి పాఠశాలలో హోలీ స్టిక్ ప్రోగ్రెస్ కార్డులను విద్యార్థులకు ఇవ్వాల్సి ఉందన్నారు. ప్రతి పాఠశాలలో స్థానిక ప్రజాప్రతినిధులు హాజరయ్యేలా ప్రణాళికలు రూపొందించుకోవాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, పోలీస్, వైద్య శాఖ అధికారులు, విద్యార్థుల తల్లిదండ్రులిద్దరూ హాజరు కావాలన్నారు. డి ఈ ఓ చంద్రకళ ,మండల స్థాయి అధికారులు, కళాశాలల ప్రధానాచార్యులు, పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

## బయోడీజిల్ మంటల్లో గాయపడ్డ వ్యక్తి మృతి

విశాలాంధ్ర-రెంటచింతల: రాష్ట్రవ్యాప్తంగా సంచలనం రేకెత్తించిన బయోడీజిల్ మంటల్లో గాయపడ్డ సంగం భాగ్యారావు (52) మంగళవారం మృతి చెందాడు. పోలీసుల వివరాలిలా ఉన్నాయి. పాలువాయి జంక్షన్లో అక్రమంగా నిల్వ చేసిన బయోడీజిల్ దుకాణంలో మంటలు చెలరేగిన సంగతి పాఠకులకు విదితమే. లారీ నుంచి బయోడీజిల్ పీపాలు నింపుకుంటున్న తరుణంలో విద్యుత్తు మోటారు స్విచ్ ఆపే ప్రయత్నంలో మంటలు ఉవ్వెత్తున ఎగిసిపడ్డాయి. ఆ దుర్ఘ ఘటనలో షేక్ రఫీక్ సజీవ దహనమయ్యాడు. గాయపడ్డ భాగ్యారావును అంబులెన్స్ ద్వారా మాచర్ల ప్రభుత్వ వైద్యశాలకు తరలించారు. మెరుగైన వైద్యం కోసం పిడుగురాళ్ల ప్రవేట్ వైద్యశాలలో చికిత్స అందిస్తున్నారు. మంగళవారం మృతి చెందినట్లు ఎస్సై నాగార్జున వెల్లడించారు.

## స్వామివారి దర్శనానికి లోకేష్‌కు ఆహ్వానం

విశాలాంధ్ర-మంగళగిరి : పట్టణంలో వెలసియున్న శ్రీ లక్ష్మీనరసింహస్వామి వారి దేవస్థానంలో ఈ నెల 30న ముక్కోటి ఏకాదశి సందర్భంగా భక్తుల రద్దీ దృష్ట్యా తీసుకుంటున్న ఏర్పాట్లలో భాగంగా ప్రచార గోడపత్రికలు, ఆహ్వాన పత్రికలను మంత్రి నారా లోకేష్‌తో మంగళవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా దేవస్థానం తరపున వైకుంఠ ఏకాదశి నాడు శ్రీ స్వామివారి దర్శనానికి విచ్చేయాలని ఆయనకు అధికార ప్రతినిధులు ఆహ్వానం అందజేశారు. కార్యక్రమంలో దేవస్థానం సహాయ కమిషనర్, కార్యనిర్వహణ అధికారి, ఆలయ అర్చకులు, సిబ్బంది పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నియంత్రణకు చర్యలు : మేయర్

విశాలాంధ్ర-గుంటూరు సిటీ: నగరంలో ట్రాఫిక్ నియంత్రణకు తగిన విధంగా రోడ్ల విస్తరణ, ప్రత్యామ్నాయ రహదారుల అభివృద్ధిపై అధికారులు దృష్టి పెట్టాలని నగర మేయర్ కోవెలమూడి రవీంద్ర తెలిపారు. నగర కమిషనర్ పులి శ్రీనివాసులు అధ్యక్షతన మంగళవారం కమిషనర్ క్యాంప్ కార్యాలయంలో గుంటూరు నగర ట్రాఫిక్ అడ్వైజరీ కమిటి అత్యవసర సమావేశం జరిగింది. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, గుంటూరు నగరంలోని కాకాని రోడ్ నుండి జాతీయ రహదారికి వెళ్లేలా రిలయన్స్ బంక్ దగ్గర నుండి రోడ్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలన్నారు. కమిషనర్ మాట్లాడుతూ నగరంలో ప్రధాన కేంద్రాల్లోని యాడ్ ఏజెన్సీ సంస్థలు నిర్దేశిత టెండర్ నిబంధనల మేరకు ట్రాఫిక్ సిగ్నల్స్, బ్లింకర్స్, పోలీస్ అవుట్ పోస్ట్, సిసి కెమెరాలు, వే ఫైండర్స్, కంట్రోల్ రూమ్‌లను ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. ట్రాఫిక్ డీఎస్పీ బి.శ్రీనివాసరావు, సిఐ అశోక్ కుమార్, జీఎంసి సిటీ ప్లానర్ రాంబాబు, ఎస్ఈ (ఇంచార్జి) సుందరరామిరెడ్డి పాల్గొన్నారు.

# ప్లాస్టిక్ తో క్యాన్సర్ ముప్పు, ప్లాస్టిక్ వద్దు క్లాత్ ముద్దు

విశాలాంధ్ర-విజయవాడ (లబ్బీపేట) :- ప్లాస్టిక్ వాడకంతో క్యాన్సర్ ముప్పు పెరుగుతుందని పలు అధ్యయనాలు హెచ్చరిస్తున్నాయని, ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించండి మీ ప్రాణాల్ని కాపాడుకోండి ప్లాస్టిక్ అనేది వద్దు క్లాత్ ముద్దు పాలిథిన్ కవర్లను మరియు ప్లాస్టిక్ కవర్ల వాడకాన్ని తగ్గించండి క్లాత్ బ్యాగులు పేపర్ బ్యాగుల వాడకం మంచిదని డాక్టర్ రామకృష్ణ సీఫ్ మెడికల్ ఆఫీసర్ మాక్స్ విజన్ ఐ హాస్పిటల్ కంటి వైద్యులు వివరించారు. క్లాత్ బ్యాగుల మీద అవగాహన కార్యక్రమం కూడా నిర్వహించారు . ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా ఎకో ఫ్రెండ్లీ కాటన్ ప్రొడక్ట్స్ అధినేత కాసరనేని కృష్ణ ప్రసాద్, కంటి వైద్య నిపుణులు డాక్టర్ రామకృష్ణ, విజయవాడ క్లస్టర్ ఆపరేషన్ మేనేజర్ సాగర్, ఏపీ మార్కెటింగ్ ఇన్సూరెన్స్ కోటి,భీమ కలపాల, హాస్పిటల్ సిబ్బంది పాల్గొని విజయవంతం చేశారు.

## బాల ఉత్సవ్‌లో విశ్వభారతి విద్యార్థుల ప్రతిభ

విశాలాంధ్ర - గుడివాడ : ఇటీవల పట్టణంలో నిర్వహించిన బాల ఉత్సవ్ కార్యక్రమంలో విశ్వభారతి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరించి వివిధ పోటీలలో విజేతలుగా నిర్వహించినట్లు పాఠశాల వ్యవస్థాపకులు పొట్లూరి శ్రీమన్నారాయణ తెలిపారు. మంగళవారం స్థానిక రాజేంద్రనగర్‌లో విశ్వభారతి స్కూల్ వివిద పోటీలలో విజయం సాధించిన విద్యార్థులను అభినందించే కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ అత్య అధిక సంఖ్యలు వాస్యరచన, నృత్యం, చిత్రలేఖనం, దేశభక్తి గీతాలాపన, జానపద నృత్యం, కోలాటం, మొదలైన సాంస్కృతిక పోటీలలో విశ్వభారతి విద్యార్థులు అధిక సంఖ్యలో పాల్గొని బహుమతులు కైవసం చేసుకున్నట్లు తెలిపారు.

## మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలి

విశాలాంధ్ర-గన్నవరం



: నవజీవన్ బాల భవన్ ఆధ్వర్యంలో గన్నవరం మండలం ముస్తాబాద్ గ్రామం లోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రం లో ఆశా మరియు ఆరోగ్యకార్యకర్తలకు మత్తు పదార్థాలు మరియు సోషల్ మీడియా దుర్వినియోగం పై మంగళవారం వర్క్‌షాప్ కార్యక్రమాన్ని, నిర్వహించారు. ఈ కార్యక్రమములో నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ ఎస్ జాకబ్ రాజు మాట్లాడుతూ సామాజిక బాధ్యతతో మాదకద్రవ్యాల వినియోగాన్ని నివారించాలని, అన్నారు, అనంతరం నీతోడు మానసిక వికాసకేంద్రం జోనల్ కోఆర్డినేటర్ డి వెంకటేశ్వరావు, ఈ మాదక ద్రవ్యాలకు అలవాటు పడిన బాలలను మరియు యువత ను డీ-ఎడిక్షన్ చికిత్స ద్వారా సాధారణ స్థితికి తీసుకొనిరావచ్చు అని ఈ చికిత్స అందించేందుకు 'నవజీవన్ బాల భవన్ సంస్థ వారు ఈ లాంటి సమస్యల తో ఉన్నవిద్యార్థులకు మరియు యువతకు నూజివీడు మండలం పొలసానపల్లిలో ఏర్పాటు చేసిన అనంతరం ముస్తాబాద్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం మెడికల్ ఆఫీసర్ ఎన్ సత్యవతి మాట్లాడుతూ మాదక ద్రవ్యాలు మెదడుపై తీవ్ర ప్రభావం వల్ల శరీరకంగానూ, మానసికంగానూ ప్రభావం చూపిస్తుంది అని సోషల్ మీడియా మరియు మాదకద్రవ్య వ్యసనాన్ని అధిగమించడానికి డాక్టర్లు, కుటుంబ సభ్యులు, మత్తు పదార్థాలు మరియు సోషల్ మీడియా దుర్వినియోగం పై ఆశా వారి సేవలను ఉపయోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమములో ముస్తాబాద్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రం యం పి హెచ్ జయలక్ష్మి, సూపర్ వైజర్ రేని రాజ్యన్, ఆశా మరియు ఆరోగ్యకార్యకర్తలు పాల్గొన్నారు,

# ఆర్ఆర్ఆర్‌పై రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌కు ఫిర్యాదు చేస్తాం

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్ ) : డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణంరాజు (ఆర్ఆర్ఆర్)పై రాష్ట్రపతి, రాష్ట్ర గవర్నర్‌కు పిర్యాదు చేయనున్నట్లు హైకోర్టు న్యాయవాది, జై భీమ్ రావు భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షులు జడ శ్రవణ్ కుమార్ తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లోని వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ డిప్యూటీ స్పీకర్‌గా ఉన్న వ్యక్తి అన్ని రాజకీయ పార్టీలను సమానంగా చూడవలసిన హోదాను పక్కన ఎట్టి వీధి రాజకీయాల్లో తల దురుస్తున్నారని అగ్రహం వ్యక్తం చేశారు. గత ప్రభుత్వం లో రఘురామకృష్ణం రాజు తాను మంచి మిత్రులం,జ్యూడిషల్ మీద ఆయనకు బాగా అవగాహన ఉందన్నారు.ఒక జడ్జి గా పని చేసిన అనుభవం,హైకోర్ట్ న్యాయవాదిగా నాకు ఉన్న అవగాహనతో మాట్లాడుతున్నా సీనియర్ ఐపిఎస్ అధికారి పివి.సునీల్ కుమార్ మీద డిప్యూటీ స్పీకర్ హోదాలో అఖిల భారత సర్వీసుల(క్రమశిక్షణ అప్పీలు)కు లెటర్ రాసారన్నారు. చట్టంలోని 4 రూల్స్ కి విరుద్ధంగా ఆయన మాట్లాడాదని, విధుల నుండి తొలగించమని చెప్పారు. కాపులు, దళితుల కలస్తే రాజ్యాధికారం వస్తుందని, నిమ్న జాతులకు ప్రాధాన్యత వస్తుందనే మాట్లాడితే ఆయనను శిక్షించాలని, ఉరి వేయాలని రఘురామ అంటున్నారని సస్పెన్షన్‌లో ఉన్న ఓ అధికారి మంచి మాట మాట్లాడితే చట్ట విరుద్ధం అంటున్నారు. కులాల మధ్య చిచ్చు పెట్టేలా ఉన్నాయని, మతాల. మధ్య గొడవలు పెట్టేలా ఉన్నాయని ఆ లేఖలో రాసారు. రఘురామ్ ముందు టీడీపీ సభ్యత్వానికి రాజీనామా చేశారా అని ప్రశ్నించారు. డిప్యూటీ స్పీకర్ పదవి తీసుకునే ముందు.. పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేయాలి చేశారా లేదో ఒకసారి చూసుకోండి అని ఎద్దేవ చేశారు. స్పీకర్,డిప్యూటీ స్పీకర్ రాజకీయాలు మాట్లాడకూడదని సుప్రీంకోర్ట్ స్పష్టంగా చెప్పిందన్నారు. పొలిటికల్ అజెండా లేకుండా వారు మాట్లాడాలన్నారు. రఘురామకృష్ణంరాజు చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఫోటో పెట్టుకుని ఎలా మాట్లాడతారు అది చట్ట విరుద్ధం నీతులు చెప్తున్న రఘురామకు రూల్స్ తెలియవా అని ప్రశ్నించారు. అధికార, ప్రతిపక్షం పార్టీలను సమానంగా ట్రీట్ చేయాల్సిన మీరు.. మీ పార్టీ అజెండాను అసెంబ్లీ లో అమలు చేయడం లేదా అన్నారు. మీకు రూల్స్ మీకు వర్తించవా ఇతరులకు మాత్రం అన్ని రూల్స్ వర్తిస్తాయా అన్నారు. ప్రతిపక్ష హోదా ఇవ్వాలా వద్దా ఎన్ని సీట్స్ వస్తే ఇస్తారు.. ఇలాంటి డిబేట్స్ లో పాల్గొనకూడదు. కానీ రఘురామకృష్ణంరాజు బహిరంగా, మీడియా డిబేట్స్ లో మాట్లాడుతూ జగన్ గురించి హేళన గా, వ్యంగ్యంగా మాట్లాడుతున్నారన్నారు. నీలం సంజీయయ్య... వెంకయ్యనాయుడు లాంటి వాళ్లు ఎంతో హుందాగా ఆరోజుల్లో వ్యవహరించారన్నారు. రాజకీయాలు మాట్లాడాలి అనుకుంటే.. మీ నియోజకవర్గంలో మాట్లాడుకోండి.మీ నియోజకవర్గంలో ఒక అధికారి చర్చికి వెళ్తే.. అతని మీద ఫిర్యాదు చేస్తారా అసలు ఫిర్యాదు చేయడానికి మీరు ఎవరు అని ప్రశ్నించారు. చంద్రబాబు మీద క్లోజ్ చేస్తున్న కేసులు.. తిరిగి రీ ఓపెన్ చేసేలా మా పార్టీ పోరాటం చేస్తుందన్నారు. ఫైబర్ నెట్ కేసు, లిక్కర్ కేసులో చంద్రబాబు మీద ఉన్న కేసులు ఎలా క్లోజ్ చేస్తారు అని ప్రశ్నించారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ మీద కేసులు ఎవరికి తెలియకుండా విత్ డ్రా చేసుకున్నారు. చంద్రబాబు కోసం పోరాటం చేసిన నా లాంటి వారి మీద ఉన్న కేసులు ,అమరావతి రైతులు మీద కేసులు మాత్రం మాఫీ కావు అన్నారు.

## 3 రోజుల పిక్ 'ఎన్' డ్రాప్ మెగా ఉచిత దంత ఆరోగ్య శిబిరం ప్రారంభం

విశాలాంధ్ర-విజయవాడ:- ఆయుష్మాన్ భారత్ స్ఫూర్తితో ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ జన్మదినోత్సవం సందర్భంగా ఈ ఏడాది సెప్టెంబర్ లో ప్రారంభమైనటువంటి మెగా వైద్య శిబిరాలలో భాగంగా నగరంలో ఉచిత మెగా వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. గతంలో పిఠాపురంలో 3 రోజులపాటు నిర్వహించిన ఈ శిబిరంకి కొనసాగింపుగా పలు నగరాలలో కూడా నిర్వహిస్తున్నారు. ఈ మేరకు మెగా ఉచిత దంత ఆరోగ్య శిబిరం ఘనంగా ప్రారంభమైంది. ఇది ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర చరిత్రలో ఇప్పటివరకు నిర్వహించబడిన అతి పెద్ద దంత ఆరోగ్య శిబిరంగా నిలిచిందని నిర్వాహకులు తెలిపారు. ఈ చారిత్రాత్మక కార్యక్రమాన్ని జీఎస్ఎల్ హాస్పిటల్స్ & ఇన్స్టిట్యూషన్స్ ఛైర్మన్ డాక్టర్ గన్ని భాస్కర్ రావు, నియో ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ దివ్య రాజ్ మార్గదర్శకత్వంలో జీఎస్ఎల్ నియో హెల్త్‌కేర్ & ఎడ్యుకేషన్ నెట్‌వర్క్ ఆధ్వర్యంలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, ఎన్ఎస్ఎస్ మరియు షీ ఫౌండేషన్ సహకారంతో నిర్వహించారు. ఈ కార్యక్రమం పి4 విజన్ (పబ్లిక్ ప్రైవేట్ పీపుల్ పార్ట్నర్‌షిప్) లక్ష్యాలకు అనుగుణంగా అమలైందన్నారు. ఈ కార్యక్రమం 2025 సెప్టెంబర్ 2వ తేదీన నిర్వహించబడిన భారీ దంత ఆరోగ్య సర్వేతో ఆరంభమైందిని, పిఠాపురం నియోజకవర్గంలోని 25,000 కుటుంబాలు మరియు 3,000 మంది పాఠశాల విద్యార్థులను కవర్ చేస్తూ ఈ సర్వే విస్తృత దంత ఆరోగ్య అవగాహన కల్పించడంతో పాటు విలువైన కమ్యూనిటీ హెల్త్ ప్రొఫైల్స్ అభివృద్ధి చేసిందన్నారు. సర్వే అనంతరం ఈ కార్యక్రమం విపులమైన చికిత్స దశకు మారింది. ఇందుకోసం కల్యాణ మండపాన్ని పూర్తిస్థాయి తాత్కాలిక దంత ఆసుపత్రిగా మార్చుచేసి మొబైల్ క్లినిక్స్, స్టెరిలైజేషన్ యూనిట్స్, రూట్ కెనాల్ స్టేషన్లు, డిజిటల్ రిజిస్ట్రేషన్, ఆన్‌సైట్ ఫార్మసీ వంటి ఆధునిక వసతులు కల్పించారు. సేవల్లో స్కేలింగ్, పళ్ల తొలగింపు, పళ్ళు కట్టుట, ఫిల్లింగ్స్, రూట్ కెనాల్ చికిత్స, దంత స్క్రీనింగ్ మరియు పిల్లల నివారణాత్మక దంత చికిత్స వంటివి ఉన్నాయన్నారు. మూడురోజుల్లో 6,000 మందికి పైగా రోగులకు చికిత్స అందించడంతో, ప్రజల అద్భుతమైన స్పందన దృష్ట్యా సేవలను మరింతగా పొడిగిస్తున్నారని చెప్పారు.

## చంద్రన్న భీమా పునరుద్ధరించాలి

విశాలాంధ్ర-చల్లపల్లి : నిరుపేద కుటుంబాలలో యజమాని అనారోగ్యంతోనో, ప్రమాదవశాత్తూ ఆకస్మికంగానో మరణిస్తే ప్రభుత్వం చెల్లించే చంద్రన్న భీమా పథకాన్ని తిరిగి పునరుద్ధరించాలని ఎస్సీ ఎస్టీ ఎంప్లాయిస్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు దేవరపల్లి సురేష్బాబు విజ్ఞప్తి చేశారు. చల్లపల్లి ఎస్టీ కాలనీకి చెందిన ఆకుల వెంకటేశ్వరరావు ఇటీవల అనారోగ్యంతో మరణించగా మం గళవారం వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా సురేష్ బాబు మాట్లాడుతూ, అత్యంత నిరుపేదవర్గాలకు చెందిన కుటుంబాలలో వ్యక్తి మరణిస్తే కనీసం మట్టిఖర్చులకు కూడా లేని దయనీయ పరిస్థితులు ఆవేదనను కలిగిస్తున్నాయన్నారు.

## రేపు జరిగే మాదిగల విజయోత్సవ సభను జయప్రదం చేయండి

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్ ) : ఎస్సీ వర్గీకరణ చట్టం చేసి సామాజిక న్యాయం చేసిన చంద్రబాబుకి కృతజ్ఞతలు తెలుపుతూ ఈనెల 4న (గురువారం) జింఖానా గ్రౌండ్ లో మాదిగల విజయోత్సవ సభను నిర్వహిస్తున్నామని ప్రతి మాదిగ సామాజిక ప్రజలు పాల్గొని విజయవంతం చేయాలని ఏపీ ఎమ్మార్పీఎస్ రాష్ట్ర అధ్యక్షులు పేరుపోగు వెంకటేశ్వరరావు మాదిగ పిలుపునిచ్చారు. మంగళవారం గాంధీనగర్‌లోని వారి కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఎస్సీ లలో 59 ఉప కులాలకు సమాన అవకాశాలు రావాలంటే ఏబిసిడి గ్రూపుల వర్గీకరణ చేయాలని గడచిన 32 సంవత్సరాలుగా మాదిగలు తమ హక్కుల కోసం, మాదిగ,మాదిగ ఉపకులాలు తదితర సంఘాలు ఐక్యంగా నడిపిన పోరాటాల ఫలితంగా 2024 ఆగస్టు 1న సుప్రీం కోర్టు న్యాయ ధర్మాసనం కీలక తీర్పు ఇచ్చి,షెడ్యూల్ కులాల విభజన (ఎ,బి,సి,డి వర్గీకరణ) అమలు అవసరమని స్పష్టంగా పేర్కొందన్నారు. ఈ తీర్పు లక్షలాది మాదిగల ఆశలను నెరవేర్చే దిశగా పెద్ద మైలురాయిగా నిలిచిందన్నారు. తద్వారా ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్ర అసెంబ్లీలో ఎస్సీ వర్గీకరణ చట్టం చేసి, 59 షెడ్యూల్ కులాలకు న్యాయం చేసిన ఘనత ఆయన దేనని అన్నారు. ఈ చట్టం అమలు ద్వారా విద్యా ,ఉద్యోగ రంగాలలో మాదిగలు చట్టబద్ధంగా తమ హక్కులను పొందే మార్గం ఏర్పడిందన్నారు. ఎస్సీ వర్గీకరణ పై చట్టం చేసి సామాజిక న్యాయం చేసిన ముఖ్యమంత్రి చంద్రబాబుకు యావత్ మాదిగా జాతి తరపున కృతజ్ఞతలు తెలుపుతూ 3 దశాబ్దాల మాదిగల మహోద్యమ విజయోత్సవ సభకు ప్రజా ప్రతినిధులు తరలి వస్తున్నారన్నారు. ఉమ్మడి 13 జిల్లాల నుండి మాదిగలు తరలిరావాలని ఈ విజయోత్సవంలో పాల్గొనాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో ఆలేటి యేసు పాదం, నల్లూరు శేఖర్ బాబు, సింగంపల్లి శ్రీనివాస్, యర్రం శెట్టి ప్రసాద్ రెల్లి తదితరులు పాల్గొన్నారు.

# గూడ్స్ వాహనాలపై ఫిట్‌నెస్ ఛార్జీలను పాత విధానంలోనే కొనసాగించాలి

విశాలాంధ్ర విజయవాడ లబ్బీపేట : రాష్ట్ర ప్రభుత్వం గూడ్స్ రవాణా వాహనాలపై అమలు చేస్తున్న ఫిట్‌నెస్ ఛార్జీలను పాత పద్ధతిలోనే కొనసాగించాలని న్యూ ఆంధ్ర మోటర్ ట్రక్కర్స్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి బొడ్డ శేషగిరి డిమాండ్ చేశారు. మంగళవారం నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ రవాణా రంగం తీవ్ర ఇబ్బందులను ఎదుర్కొంటుందని తెలిపారు. గతంలో ఫిట్‌నెస్ ఛార్జీలు రూ.900 నుంచి రూ.1,400 వరకు మాత్రమే ఉండేవని, అయితే ప్రస్తుతం అవి రూ.2,300 నుంచి రూ.33,000 వరకు పెరగడంతో లారీ యజమానులపై తీవ్రమైన ఆర్థికభారం పడుతోందన్నారు. ఫిట్‌నెస్ ఫీజుల పెంపుతో నిత్యావసర వస్తువుల ధరలు పెరిగే అవకాశం ఉందని, ఫలితంగా ప్రజలపై అదనపు భారం పడుతుందని తెలిపారు. రైతులకు కూడా రవాణా ఛార్జీలు పెరగడం వల్ల వ్యవసాయ వ్యయాలు మరింతగా అధికమవుతాయని పేర్కొన్నారు. రాష్ట్రంలో రోడ్ల పరిస్థితి దారుణంగా ఉందని విమర్శించిన ఆయన, గుంతలు ఉన్న రోడ్ల కారణంగా వాహనాలు తరచూ మరమ్మత్తులకు గురవుతున్నాయని చెప్పారు. వాహనాలకు ఫిట్‌నెస్ సర్టిఫికేట్ తప్పనిసరి చేసిన ప్రభుత్వం, వారు నిర్మించే రోడ్లకు కూడా ఫిట్‌నెస్ సర్టిఫికేషన్ ఇవ్వగలదా అంటూ ప్రశ్నించారు. రవాణా రంగం రాష్ట్రానికి ముఖ్య ఆదాయ వనరుగా ఉన్నప్పటికీ, ప్రభుత్వం చిన్నచూపు చూస్తోందని అసహనం వ్యక్తం చేశారు. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ విభజన తర్వాత రెండు రాష్ట్రాల మధ్య కౌంటర్ సిగ్నేచర్ ఫైల్‌ను తెలంగాణ ప్రభుత్వం మూడు సంవత్సరాల్లోనే ఆమోదించి పంపినా, ఆ ఫైల్ గత ఎనిమిదేళ్లుగా ఏపీ రవాణా శాఖ ముఖ్య కార్యదర్శి వద్ద పెండింగ్‌లోనే ఉందని విమర్శించారు. రోడ్డు ప్రమాదాల నివారణ కోసం జాతీయ రహదారుల పక్కనే సర్వీస్ రోడ్ల నిర్మాణం అత్యవసరమని ఆయన అన్నారు. జాతీయ రహదారులపై ద్విచక్ర, త్రిచక్ర వాహనాలను నిషేధించి, వాటిని సర్వీస్ రోడ్లపై నడవేలా చర్యలు తీసుకుంటే ప్రమాదాలు గణనీయంగా తగ్గుతాయని అభిప్రాయపడ్డారు. భారీ వాహనాలు హైవేపై ప్రయాణించడం వల్ల ప్రమాదాలు తగ్గే అవకాశం ఉందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో కోశాధికారి డి.వి. నరసింహారావు,ఎన్‌టీఆర్ జిల్లా ఇంచార్జ్ గరికపాటి భాస్కర్‌రావు, సభ్యులు ఏడుకొండలు, మధుబాబు, వెంకటేశ్వరరావు, వేణుగోపాల్‌రావు, నవీన్‌కుమార్, కృష్ణారావు, సామెలు రాజు, లక్ష్మణరావు తదితరులు పాల్గొన్నారు.

## వేమన ఆరోపణలపై పరువునష్టం కేసు

విశాలాంధ్ర,విజయవాడ (గాంధీనగర్) : రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన వేమన సతీష్ ఎమ్మెల్యే టికెట్ ఇప్పిస్తానని ఏడు కోట్ల రూపాయలు తీసుకుని మోసం చేశారని అసత్య ప్రచారం చేస్తున్న సుధారాణి,ఆమె భర్త మురళి పై 10 కోట్లకు పరువు నష్ట దావా వేశామని సతీష్ తరుపున పిల్ వేసిన హైకోర్టు సీనియర్ న్యాయవాది మాగులూరు హరిబాబు తెలిపారు. మంగళవారం గాంధీనగర్‌లోని ప్రెస్‌క్లబ్‌లో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వేమన సతీష్ రైల్వే కోడూరు ప్రాంతానికి చెందిన ఎన్నారై టిడిపి నేత వేమన సతీష్‌కు ఎమ్మెల్యే టికెట్ కోసం ఏడు కోట్ల రూపాయలు ఇచ్చి మోసపోయానని సుధారాణి,ఆమె భర్త మురళి అసత్య అరోపణలు చేస్తున్నారన్నారు.ఆయన నిజంగా మోసం చేసి ఉంటే ఎలక్షన్స్ అయిపోయి 2 సం.లు కావస్తుందని ఇంతకాలం ఎందుకు మౌనంగా ఉండి ప్రస్తుతం అరోపణలు చేయటం వెనుక రాజకీయ లబ్ధి పొంది సమాజంలో చులకన చేసి పరువుకు భంగం కలించాలనే కుట్ర ఉందనే అనుమానం కలుగుతందన్నారు. వారి దగ్గర ఏమైనా ప్రాథమిక ఆధారాలు ఉంటే కోర్టులో గాని పోలీస్ స్టేషన్‌లో గాని జరిగిన అన్యాయాన్ని ప్రశ్నించేందుకు చాలా అవకాశాలు ఉన్నాయి కానీ వాటి ద్వారా ఎందుకు ప్రశ్నించట్లేదు అని ప్రశ్నించారు.ఎటువంటి దురుద్దేశం లేకపోతే ఎందుకని చట్టపరంగా ముందుకు రాలేదు అన్నారు.తన క్లయింట్ సతీష్ అమెరికా లో ప్రవస భారతీయుల యొక్క క్షేమాలను ఉద్దేశించి అనేక కార్యక్రమాలు చేస్తూ సమాజంలో ఎంతో పేరు ప్రఖ్యాతలు సంపాదించుకున్నారన్నారు.ఆ పేరును చెడగొట్టాలు అని కొంతమంది సుధారాణి వంటి వారిని పావులుగా వాడుకొని అసత్య ఆరోపణలు చేయడం జరుగుతుందన్నారు.ఆయపై వేసిన అబద్ధాలు తాలూకు తాము విజయవాడ జిల్లా కోర్టు నందు (ఓ ఎస్ నెంబర్ 190/2025) పరునష్టం దావ 10 కోట్ల రూపాయలుకు పిల్ వేయడం జరిగిందన్నారు.వారి దగ్గర ఏవైనా ఆధారాలు ఉంటే డిసెంబర్ 15న కోర్ట్ ముందుకు వచ్చి ప్రాథమిక ఆధారాలు సమర్పించవలసి ఉంటుందన్నారు.తన క్లయింట్‌ను ఆర్థికంగా మానసికంగా నష్టం కలిగించాలనే ఉద్దేశంతో వారు ఈ విధంగా చేస్తున్నారన్నారు. చేస్తున్నారు.చట్టబద్ధంగా కాకుండా సోషల్ మీడియా ద్వారా వివిధ మాధ్యమల ద్వారా మాకు పరువు నష్టం కలిగేలా ఏదైనా చేస్తే చట్టం ప్రకారం చర్యలు తీసుకోవాల్సి వస్తుందన్నారు. భారత న్యాయ వ్యవస్థ ద్వారా మేము వారిని ఎదుర్కోవడం జరుగుతుందన్నారు.

## కూచిపూడిలో మంచు తుఫాను

విశాలాంధ్ర, కూచిపూడి : మొవ్వ మండలంలో మంగళవారం మధ్యాహ్నం మంచు వర్షం కురిసింది. ఈ సందర్భంగామధ్యాహ్నం నుంచేముసురు పట్టటంతోవాతావరణంమారి విపరీతమైన చలిగాలులువేశాయి. ఈ నేపథ్యంలోప్రకృతిని మంచు దుప్పటికప్పివేసింది. సాధారణ వర్షానికి, ఈ వర్షానికి తేడా ఉండటంతో వాహనదారులు సైతం చలిలోనేప్రయాణం చేశారు. ప్రకృతి సాయంత్రం నాలుగు గంటలకే చీకట్లు ముసిరినట్టుగాతయారైంది.

## ఈఈ బాబిరెడ్డి సందర్శన

విశాలాంధ్ర, మైలవరం : స్థానిక మండల పరిషత్ మోడల్ ప్రాథమిక పాఠశాల చంద్రగూడెం ను ఈఈ బాబిరెడ్డి మంగళవారం సందర్శించారు.ఈ సందర్భంగా శిథిలావస్థలో ఉన్న పాఠశాల నిరుపయోగ భవనాన్ని పరిశీలించి శిథిలావస్థలో ఉన్నందున కూల కొట్టుటకు అంచనాలు రూపొందించవలసిందిగా స్థానిక ఇంజనీరింగ్ అధికారులకు సూచనలు ఇచ్చారు. అలాగే పాఠశాలకు అవసరమైన ప్రహరీ గోడ నిర్మాణం అంచనాలు కూడా రూపొందించి,ప్రహరీ గోడ నిర్మాణ బడ్జెట్ను మంజూరు చేయించవలసిందిగా మైలవరం మార్కెట్ యార్డ్ చైర్మన్ పోనకళ్ళ నవ్యశ్రీ ఈ సందర్భంగా ఈఈ కి తెలియజేశారు.ఈ కార్యక్రమంలో జనసేన నాయకులు శీలం బ్రహ్మయ్య,శివరాం ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు ఎం రోశాలు తదితరులు పాల్గొన్నారు...

## భగవద్గీత పారాయణంలో గోల్డ్ మెడల్ సాధించిన పుష్పాల సరళ



విశాలాంధ్ర-కృత్తివెన్ను : భగవద్గీత కంఠస్థ పారాయణం లో మండలంలోని నీలిపూడికి చెందిన పుష్పాల సరళ గోల్డ్ మెడల్ సాధించారు. ఇటీవల మైసూర్ దత్త పీఠం వారి నిర్వహించిన పోటీ పరీక్షల్లో ఆమె ఉత్తమ ప్రతిభ కనబరిచి ప్రధమ స్థానంలో నిలిచింది. గీత జయంతి సందర్భంగా మైసూర్ దత్త పీఠంలో సచ్చిదానంద సద్గురు స్వామీజీ చేతుల మీద ఆమె మెడల్ తో పాటు ప్రశంసా పత్రాన్ని అందుకున్నారు. బంటుమిల్లి మండలం నరసప్ప చెరువు గ్రామానికి చెందిన పండిత మానికొండ నాగలక్ష్మి విద్యార్థులను భగవద్గీత పారాయణ పఠనం లో తీర్చిదిద్దారు. పండిత నాగలక్ష్మి పర్యవేక్షణలో గీతా పారాయణంలో గోల్డ్ మెడల్ సాధించడం గర్వంగా ఉందని సరళ తెలిపారు. గోల్డ్ మెడల్ సాధించిన సరళను స్థానికులు అభినందించారు.

## చిగుళ్ల వ్యాధి నివారణకు డాబర్ రెడ్ పేస్ట్ పరిష్కారం

విశాలాంధ్ర-విజయవాడ: చిగుళ్ల వ్యాధిని నిర్లక్ష్యంగా చేస్తే ఆరోగ్య సమస్యలు తలెత్తుతాయని పబ్లిక్ హెల్త్ డెంటిస్ట్రీ ప్రొఫెసర్ డాక్టర్ సోనియా దత్తా తెలిపారు. చిగుళ్ల వ్యాధిని సాధరణంగా గుర్తించబడని పరిస్థితి, ఇది దంతాల నష్టం , మధుమేహం, గుండె జబ్బులు, గర్భధారణలో సమస్యలు వంటి సాధారణ నోటి ఆరోగ్య సమస్యలకు దారితీస్తుందన్నారు. నివారణ మరియు చికిత్స కోసం ముందస్తు చర్యలు తీసుకోవడంతో దీర్ఘకాలిక సమస్యల ప్రమాదాన్ని గణనీయంగా తగ్గించవచ్చున్నారు. ఆరోగ్యకరమైన చిగుళ్ళు బలమైన దంతాలకు పునాదని లవంగం, వేప వంటి సహజ పదార్థాలతో సమృద్ధిగా ఉన్న డాబర్ రెడ్ పేస్ట్ బ్యాక్టీరియాతో పోరాడటం, నోటి పరిశుభ్రతకు మద్దతు ఇవ్వడం ద్వారా మీ చిగుళ్లను మంచి స్థితిలో ఉంచడానికి సహాయపడుతుందని తెలిపారు.